అభినవ శాకుంతలము

(నాల్గంకముల నాటకము.)

ముసలాపుర గ్రామ నివాసియగు

ఘంటంభట్లగారి వెంకటభుజంగకవిచే

రచింపఁబడి

నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయు,

నభినవసరస్వతీపత్రికాసంపాదకుఁడును నగు

జానపాటి పట్టాభిరామశాస్త్రిగారిచే

బరిష్కరింపఁబడి

గుంటూరు, చంద్రికా ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

క్షయ సం॥ చైత్రమాసము.

1926.

 [వెల 1—0—0.



అభినవ శాకుంతలము.

(నాటకము.)

ప్రథమాంకము.

—*నాంది*—

శ్రీ ...ద్భవ నిషిక్తభుజాంతరవామభాగుఁడ
...క్రముఁడు సూర్యకులాభరణంబు విశ్వస్ప
...సపత్నముఖ్యనతపద్వనజుం డతసీసుమచ్ఛవి
ప్రాకటమూర్తి రామనరపాలశిఖామణి మమ్ముఁ గాప్రుతిన్

సూత్రధారుఁడు:– (నాంద్యంతమునఁ బ్రవేశించి)

ఆహా! నేనెంత ధన్యుండనైతిని. నేఁడెంతసుదివసము! విద్వజ్జన పరిష్కృతంబైయలరారు నీసభవంకఁజూడ నామనం బత్యంత సంతోషాబ్ధి నోలలాడుచున్నయది. కాని యీచతురజనవర్గం బెబ్బంగి నానందపెట్టనగునాయని యెంతయు నాలోచించు చున్నవాఁడ. (ఇంచుకయాలోచించి) అమ్మయ్యా! ఇపుడు జ్ఞప్తికివచ్చె. (వెనుకదెసఁ దిలకించి) కామినీ! ఇటురమ్ము.

నటి:— (ప్రవేశించి) మనోహరా! ఇంతతొందరగా న న్నిందుఁబిలు
చుటకుఁ గారణం బెయ్యదియో సెలవిండు.

సూత్ర:— లలనామణీ! సభాసదుల కాహ్లాదంబు గావింపఁ దగిన
శృంగారనాటకం బెద్దియేని నిశ్చయింపవలయును.

నటి:— నాథా! అట్లైన నభినవశాకుంతలమను శృంగారనాటక మున్న
దేమో కదా!

సూత్ర:— ప్రేయసీ! సమయానుకూలముగా జ్ఞప్తికిఁ దెచ్చితివి. దీనిఁ
బ్రదర్శించి సభ్యులనందఱఁ దృప్తినొందింతముగాక.

నటి:— ఆర్యా! మంచిది. ఏతన్నాటక రచనాధురంధరుఁడైన కవి
యెవ్వరు?

సూత్రి:— కలికీ! అక్కవి యభిధానముతో నేమి ప్రయోజనము?
అయినను నీవడిగితివి కాన వివరించెదను.

సీ॥ శ్రీ వైష్ణవాన్వయ సింధురాకేందుఁడౌ
శ్రీరాఘవాచార్య శిష్యవరుఁడు
ఆశ్వలాయనసూత్రుఁ డనవద్యగార్గేయ
మునివంశ పంకేజ దినకరుండు
నాగార్యలచ్చమాంబా గర్భశుక్తి ము
క్తాఫలంబు మనీషిగణసఖుండు
సత్కళాధారేయు సర్వజ్ఞు వేంకట
భూదేవమణికి సహోదరుండు
శ్రీరమానాథ పాద రాజీవయుగళ
మత్తమధుపాయమాన సన్మానసుండు
వేంకటభుజంగకవి యకలంకయశుఁడు
కలికి! విరచించె దీని సత్కవులు మెచ్చ.

నటి:— ఆర్యపుత్రా ! ఈచిన్నకవి విరచించిన నాటకము పండితుల
నెట్లు మెప్పించఁగలదు ?

సూత్ర:— రమణీ ! దీనికై నీవెంతయు శంకింపవలదు.

తే॥ శ్రీ మహాభారతైతిహ్యమే మధురము,
అందుఁ దత్కవితాశైలి యతిమృదులము,
అది రసజ్ఞులహృదయంబు నపహరించు
నంచు మనమున నెంచు మోచంచలాక్షి !

యువతీ ! మనమింకఁ గాలయాపన మొనరించు టన్యాయముగాదు.
నాటకప్రదర్శనవేళ సమీపించినది. త్వరగాఁ బోవుదము రమ్ము.

(ఇది ప్రస్తావన.)

(ఇంద్రాగ్ని యమవరుణులు సభతీర్చి కూర్చుందురు.)

ఇం:— (తనలో) ఆహా ! నేఁటివఱకుఁ బరమేశ్వరు కరుణాకటాక్షం
బునఁ జతుర్దశభువనబహుమాని తీవ్రవిక్రమక్రమ ధోరే
యుండనై నిఖిలయాతుధానసముదయంబు నడంచి యనల్ప
సామ్రాజ్యపరిపూర్ణభోగానందసంధాయకంబైన యియ్యమరా
వతీపురంబుఁ బరిపాలించుచుంటిని. నాఁటినుంచి రాజకీయ
కార్యంబుల కింతయుఁ జేటుపాటు లేకుండ నిర్వహింపఁబడుచు
వచ్చె. ఇటుమీఁదజరుగఁబోవు సత్ఫలానుభవంబు నరసి తెలిసి
కొనవలసియున్నది. ఇందుకు మత్కులాచార్యమణియైన బృహ
స్పతియే యర్హుఁడు. ఆయనతోఁ గొంతవడి ప్రసంగించి తృప్తి
నందెదఁగాక.

(అంతలో బృహస్పతి ప్రవేశించును.)

ఇం:— ఆచార్యతిలకా ! నమస్కరించుచున్నాను. ఈసింహాసనం
బలంకరింపుఁడు.

బృ:— కల్యాణమగుఁగాక.

ఇం:— మహానుభావా! ఈశిష్యుని దొకవిన్నపమున్నది.

బృ:— అదియేదియో వాక్రుచ్చుము.

ఇం:— చం॥ సురగురువర్య! మీపదరజోమహిమంబుననే చుమీ నిరం
తరవిభవంబుగల్గుట, యథార్థము, ధన్యుఁడనైతి, నంగిరస్
బరమతపోవిలాసమున భవ్యగుణాకర! మీమహత్త్వసు
స్థిరమయియుండుఁగావుత సుధీజనసన్నుత! శిష్యవత్సలా!

బుధాగ్రణీ! భూతభవిష్యద్వర్తమాన సంవేదులరగు మీ కెఱుంగరాని దొకటియైన నుండనేరదుగాన లోకప్రవృత్తి మించుక యాకర్ణింపఁగోరి యింతవఱకుఁ బ్రార్థించితి.

బృ:— (కొండొకసేపు దివ్యదృష్టిఁ బరికించి తనలో) ఇప్పు డంతయు గ్రహించితిని. నా కీస్థలంబున నెట్టియుత్పాతములు నగుపడవయ్యెఁగాని యొక్కచో విపులసద్గుణగరిష్ఠుండగు విశ్వామిత్రమునిశ్రేష్ఠుం డతిఘోరతపం బాచరించుచున్నవాఁ డిక్కఁ దెలియవచ్చెడి. ఆతనితపఃప్రభావంబు ముల్లోకంబుల నొక్కుమ్మడి నిర్మూలముగావింపనోపునని తోఁచనయ్యెడిని. కటకటా! ఊరకుండినఁ బ్రమాదము. ఈసంగతి త్రిదశాధిపతికి నిక్కముగా వివరించెద. (ప్ర)

శా॥ విశ్వస్తుత్యుఁ డమోఘవిక్రమకళావిద్యావసంపన్నుఁ డా
విశ్వామిత్రతపోధనప్రవరుఁ డీవిశ్వంబు సాధింపఁగా
శశ్వద్భక్తిఁ దుషారశైలమున శిష్యవ్రాతము గొల్వఁ ద
ద్విశ్వేశుఁ గుఱించి ఘోరతపముల్ ధీమంతుఁడై
(చేసెడిన్.

దివిజాధీశ్వరా! ఉన్నయుదంతము విన్నవించితి. ఇంకఁ దడయుట యనుచితము. ఇప్పనిఁ జక్కబెట్టుకొనకయున్న నీవు

గాసిఁ జెందఁగలవు. అంగనాకై యతనితపోవిఘ్నంబుసల్పఁ బ్రయత్నించి సుఖంబుగానుండుము. నేను నిజనివాసంబునకు వెళ్లిపోయెద. (అని నిష్క్రమించును.)

ఇం:- (స్వ) ఇమ్మహాత్ముండు నన్నాశించినకైవడి నడువకపోయిన నా కీగాధేయునివలన నిస్సంశయముగాఁ బరాభవము సంభవించును. సమయముదప్పిన వెనుక నవరించుకొనుట యెట్టివారికైన నశక్యము. అట్లుసహింపదు. గురువనుమతి [illegible] యిప్పుడే గానవిద్యాప్రవీణయు దేవవేశ్యా[illegible]యు నైన మేనకయను దానిఁ బంపి జటివరు తపోభంగంబు సేయించుటయే మేలు. సేవకా! ఇటురమ్ము.

సే:- (ప్రవేశించి) ఆర్యా! ఏమిసెలవు?

ఇం:- నీ వేతన్మహాంతర్గమునకే పోయి మేనకయను నప్సరోంగన నిందుఁ దోడ్కొనిరమ్ము.

మేన:- (సఖులతోఁ బ్రవేశించి) గీర్వాణవల్లభా! అభినందనం బాచరించుచున్నదాన. నన్నిచటికి రావించినకతం బెయ్యదియో యనుగ్రహింపుఁడు.

ఇం:- తే॥ అతులనిష్ఠాగరిష్ఠుఁడై యలరు నిత్య
సత్యనిరతుఁడు గాధేయసంయమీంద్రుఁ
డధికనిగ్రహవృత్తి హిమాద్రిపొంత
నొర్మిమైఁ దపమొనరించు చున్నవాఁడు.

కావున నమ్మునిపుంగవు తపశ్శక్తి యంతకంత కగ్గలంబై భువనత్రయబాధాకరంబై యెల్లలోకంబులం గాల్చుచున్నయది. ఈ సంక్షోభంబు నివారింపనేని నాకు సంతసము గలుగనేరదు. కాఁబట్టి యిక్కార్యంబు నెఱవేర్ప నీవు సమర్థురాలవుగా నెంచి యిందుఁ బిలిపించితిని. వెనుదీయక యాజడదారికడ కేగి నీకులవిద్యాకౌశలంబుఁ

జూపి యతనిఁ గామోపభోగసంగతుఁ జేసి విఫలమనోరథుని గావించి నాదైన దేవరాజ్యపదవిఁ గాపాడుము.

మే:- భాగ్యము.

తే॥ అమరవల్లభ ! నే యుష్మదాజ్ఞఁ గరము
నెమ్మి శిరమునఁ దాల్చి ముదమ్ముతోడ
నమ్మునీంద్రుని తపోవిఘ్న మాచరించి
వచ్చెదను ద్రిదశాళిచే మెచ్చులొంద,

దేవా ! ఇదియెంతపని. నా నేర్పువిధంబున విశ్వామిత్రు చిత్తంబు చిత్తజాయత్తంబగునట్లు చేసెదఁగాన మీరు భయపడకుఁడు.

ఇం:- మంచిది. (అని నిష్క్రమించును.)

మే:- (స్వ) అకటా ! దేవసభామధ్యంబునఁ బురుహూతుఁడడిగిన ప్రశ్నమున కుత్తరమిచ్చి పొరపడితిని. ఏమిచేయుదును. కార్యసాధన మొనరింపక మరల నింద్రునకు నేరీతి ముఖముఁజూపుదును. బ్రహ్మర్షిశేఖరుండైన విశ్వామిత్రుండు నా కెట్లు సాధ్యుఁడగును. నా ప్రయాస మెట్లుఫలవంత మగునో కదా !

తే॥ వనజసంభవతుల్యప్రభావశాలి
యగువసిష్ఠు నపత్యశోకాబ్ధిముంచి
నెగడె, ననిమిషులెల్ల నాతనికి వెఱతు,
రట్టి కోపిష్ఠుకడకు నే నెట్లుచనుదు,

సీ॥ బ్రహ్మాండభాండంబు భస్మమై కూలదే
యేచి యమ్ముని యల్గిచూచెనేని,
సప్తాంబునిధు లొక్కసారిగా నింకవే
యేచి యమ్ముని యల్గిచూచెనేని,
తరణియు శశి త్రోవదప్పిచరింపరే
యేచి యమ్ముని యల్గిచూచెనేని,

తారకల్ జలజల ధరణిపై రాలవే
యేచి యన్నుని యల్గిచూచెనేని,
అట్టి కోపిష్ఠుఁడైనట్టి యాతపస్వి
వరునిపాలికి నెవ్వగ నరుగవలయు,
అందు నబల యెటులోర్చవనగును, దైవ
కృత మలంఘ్యంబు, దీని కేగతినొ యింక.

(అని వితర్కించి ధైర్యమూని) విశ్వామిత్రుండు సమధిక తపోబలసంపన్నుఁ డగుఁగాక. బృందారకవల్లభుండు నిండు పేరోలగంబున మత్కులాంగనల నెవ్వరిని గాదని నన్ను బహూకరించి యిప్పని యొనర్ప నియోగించె, ఇంతకన్న భాగ్యమున్నదా! చింతింపనేల. మదభ్యస్త వాత్స్యాయనశాస్త్రనైపుణ్యంబున మహాత్ముని వలపించెద. ఇంద్రుని మనోభీష్టంబు దీర్చెద. పోయివచ్చెద. (అని నిష్క్రమించును)

(విశ్వామిత్రుండు హిమవత్పర్వతస్థ తపోవనమునఁ దపస్సు చేయుచు శిష్యులతోఁగూడఁ బ్రవేశించును.)

మే:- (మరలఁ బ్రవేశించి, స్వ)

ఉ॥ చందనకందరాళి ఘనసారకపిత్థ రసాలకేతకీ
కందశిరీషలుంగ వటకాంచనబిల్వ కరీరనారికే
కుందకురంటకాది తరుగుల్మలతాపరి[illegible]
నందముగొల్పు నియ్యుపవనంబు [illegible] వేడుకయ్యెడున్,

ఇయ్యారామతిలకంబు నలంకరింపఁజాలిన యప్పరమతపోధనుఁ డెచ్చో నున్నవాఁడో పరికించిచూచెద (ఎదుటనే ఋషిపుంగవు దర్శించి సంతోషమున – ప్ర) మునికులసార్వభౌమా! నమస్కరించెద. మత్ప్రతిజ్ఞాభంగంబు గాకుండున ట్లనుగ్రహించి యాశీర్వదింపుఁడు.

వి:– (ఊరకుండును)

మే:— (స్వ) ఏమిది? ఇమ్మహాత్ముఁడిట్లూరకుండుటకుఁ గతం బెద్దియో తెలియదు. (ఆలోచించి) యోగనిద్రాభిరతి నుండనయ్యెఁ. ఒండేమియుఁ గాదు. మంచిది. ఇతనికి మెలఁకువ గలుగువఱకుఁ బలుకరింపఁ గూడదు. అంతవఱకు నాసఖులతో నిందే విహరించుచుండెద. (పరి) విమలా! ఇటురమ్ము.

వి:— అమ్మా! ఏమి?

మే:— చూచితివా?

వి:— ఎవరిని?

మే:— బ్రహ్మర్షిసత్తముఁడైన విశ్వామిత్రుని.

వి:— ఏడి?

మే:— ఇదుగో, మనముందఱనే శిష్యగణంబు మూఁగికొలువఁ దపశ్చర్య నడపుచు నూతనవైశ్వానరుండునోలెఁ దేజరిల్లు చున్నవాఁడు.

వి:— అమ్మో! ఏకేనా వారు?

మే:— కలికీ! ఏకేనా నాఁరని యంటి వదియేల?

వి:— కాదు. నాకాధిపతి నిన్నుఁబంపినది విరకొఱకేనాయని

మే:— అవును.

వి:— ఎందుకు?

మే:— ఇతని మోహింపఁజేయ

వి:— చేసితివా?

మే:— లేదు. ఈయన ప్రకృతము సమాధినిష్ఠ మెలఁగుచున్నందున నించుక శంకించి యూరకుంటిని.

వి:— మఱి నన్నెందుల కిక్కడికిఁ బిల్చినది?

మే:— పిలిచినపని పిమ్మటఁ జెప్పెద. ఇది వేళగాదు. మన యనుంగు చేడియలతో నీప్రదేశంబున స్వేచ్ఛావిహారంబు సల్పుచుందము రమ్ము.

వి:— మంచిది. అట్లేకానిమ్ము

మే:— (చెలుల నవలోకించి)

సీ॥ మదిరాక్షి ! చూచితే మాతులుంగలవంగ
జంబీరజంబూ కదంబకముల,
మానినీమణి ! కంటె మాలూరమరువక
మల్లికాశతపత్రహల్లకముల,
అలివేణి ! కాంచితే లలిఁ గింశుకాశోక
కదళీమదనచూతకాంచనముల,
కలికి ! వీక్షించితే కరవీరపున్నాగ
సాలతమాలహింతాలకముల,
తరుణి ! దర్శించితే సులతాలతాంతి
ప్రకటపరిపక్వఫలభూజనికరనిరత
గురుతరానందకరమునై కొమరుమిగులు
లలితశృంగారవనవాటి లక్షణంబు,

బింబోష్ఠులారా ! ఇయ్యుపవనప్రదేశంబునంగల విచిత్రంబుల
నన్నింటిని నేత్రోత్సవంబుగా వీక్షించితిరా ?

చెలులు:— కాంతామణీ ! మేమందఱము నిందలి చమత్కారము
లెంతయుఁ గన్నులపండువుగా నవలోకించితిమి.

మే:—సీ॥ మాకందమనఁ జాల మాకందమగుఁ జుమ్మి,
యీకొమ్మఁ జేకొమ్మ, యిందురమ్మ
మృగాక్షీ ! అదిగోచూడుము రాజహంసల విలాసవైఖరిః

చె:— మంచిది

మే:— చంచలాంగి ! ఇచట నాలోకించితే నీలకంఠము లేలీల నా
ట్యము సలుపుచున్నవో

నారంగముల నేఁడు చేరంగఁజని చూడుఁ,
ఁడీయందమునకున్న యెందు నీడు,

చె:— ఔనే, కడు రమణీయముగానున్నది

మే:— పున్నాగములనీడఁ గన్నారె మతితోడఁ
బున్నాగములు క్రీడనున్న జాడ

చె:— అక్కా! ఇక్కమలాకరంబుఁ జూచితివా ?

మే:— తామరసమకరంద రసాస్వాదవప్రముదితమధుకరాంగనాసంగీత
కళాకలాప మతిమధురముగా వినవచ్చుచున్నది.

చె:— అది యటుండనిమ్ము. మఱియొకొక విశేషము

మే:— ఏమి టది ?

చె:— నాళీకతతి సొంపు నాలోక మొనరింపు,
శీలింపు మీపెంపు, చిత్తగింపు,

కలకంఠి ! ఈ యుద్యానగురుజాంపములమీఁద హిమాంబువులు ముక్తాఫలంబులుంబోలెఁ బ్రకాశించుచున్నయవి.

మే:— అవును. నిజమైనముత్యము లే యనవచ్చును.

తే॥ వివిధఫలపుష్పతరులతావిశ్రుతంబు
శారికాకీరకలహంససంయుతంబు
సిద్ధచారణగంధర్వసేవితంబు
నై వెలయుఁ గంటె కౌశికు నాశ్రమంబు,

కోమలీ ! ఈరసాల మెట్లుచిగిరించినది !

చె:— ఆహా ! మిగుల మనోహరముగాఁ జిగిరించినది

మే:— కామినీ ! ఈ శుకసంభాషణము వింటివా ? శుకసంభాషణమే కదా !

చె:— అమ్మా ! శుకసంభాషణమే చుమీ

ప్రథమాంకము.

మే:— ఏశుకసంభాషణము ?

చె:— శ్రీశుకసంభాషణము

మే:— అహాహా ! విమలా ! విమల ! ఇక్కడికి రావే

వి:— ఎందుకమ్మా ?

మే:— ఎక్కడికిఁ బోయితివే

వి:— నే నెక్కడికిఁ బోయితిని, ఈ సురపొన్న చెట్టుక్రింద సేదదీఱఁ గూర్చుంటిని

మే:— నాకుఁగూడ మిగులశ్రమయే యైనది. ఇంక వనకేళిఁ జాలించి యిచ్చటి నికుంజమ్ములసరస నించుక విశ్రమింతము.

వి:— ఆఁ (అందఱు కూర్చుందురు.)

మే:— (విమల చెవిలో నేమో రహస్యముగాఁ జెప్పి యాపెతోడ నిష్క్రమించును)

విశ్వా:—

శా॥ ప్రత్యూషంబిది శిష్యులార ! యితరవ్యాపారము ల్మాని మీ
నిత్యాచారములెల్ల నేమరక యింతే శ్రద్ధమై సల్పి వే
యత్యుల్లాసమునన్ సమిత్కుశఫలాహారంబులం దెండు, స
త్కృత్యుల్ మిమ్ములఁబోలువార్గలరె నాకున్ శిష్యు లిమ్మేదినిన్,

మే:— (విమల వెనుకప్రక్కన నిలిచి వినుచుండును)

శి:— స్వామీ ! సమిత్కుశఫలాదులన్నియు నిదివఱకే సంగ్రహించి తెచ్చితిమి కైకొనుఁడు.

వి:— ఆనందము. ఆనందము

మే:— విమలా ! విన్నావే మునికుంజరుండు శిష్యులతో నేమేమో మాటలాడుచున్నాఁడు.

వి:— విన్నాను. విన్నాను. ఏమి

మే:- నీ విందేయుండుము. నే నచటికరిగి యా సమాచారమంతయుఁ దెలిసికొనివెద

వి:- పొమ్ము పొమ్ము. ఇప్పుడే పొమ్ము. నే నిందేయుండెద

విశ్వా:- (స్వ) ఆహా ! ఈస్థలం బన్యజనసామాన్యసంచార్యము గాక యుండ నేఁ డత్యంతమృదులమృగమదఘనసారచందన సుగంధ బంధురంబైన వినూతనమలయానిలము ప్రసరింపఁదొడంగె. ఇది యేమివింత ? ఇం దెందైన స్త్రీజనము సంచరించుచుండఁ బోలు. లేకున్న నీవిపర్యాసమునకు వేఱుకారణ మగుపడదు. (దిక్కులు పరికించి విస్మయానందకలితచిత్తుండై)

మ॥ సరిరా చక్కదనంబు, మేల్ప్రాయులు, మజ్జారే విలాసంబు పై
సిరి, యయ్యారె వగ, ల్బలే సొగ, సహా సింగార, మౌఁ జేఁత, ల
ద్దిర శీలంబు, బళా తనూవిభవ మెంతే లెస్సయౌరౌర, యి
త్తరుణీరత్నముతోడఁ బోలఁగలరా తర్కింప లోకంబునన్,

లలనాశిరోమణి వయోరూపలావణ్య సౌందర్యరేఖావిశేషంబులు లక్షింపఁ బ్రసవశరుండు కుసుమశిలీముఖంబుల నాహృదయపంకజంబు భేదింప గమకించెనే. ఎటుల భరింతును.

తే॥ తరుణిగా దిది వలపుల బరణిగాని,
చెలువగా దిది యరయఁ జెంగలువగాని,
కలికిగా దిది మదనుని ములికిగాని,
చామగా దిది సౌజన్యధామగాని,

(అని చేనున్న జపమాలికయు హంసదండమును జాఱవైచి నిశ్చేష్టితుఁడగును.)

మే:- (నవ్వి) ధన్యాస్మి ధన్యాస్మి. నా కోర్కి ఫలియించినది. నిశ్చయముగా ఫలియించినది.

ప్రథమాంకము.

వి:— (ఇంచుక తెలివివహించి యాలోచించుచు)

సీ॥ ఈచిన్నిలతకూన యెవతెకాఁబోలును
బాలేటిరాచూలిలీలఁదనరు,
ఈసరోజనిభాస్య యెవతెకాఁబోలును
గిరిరాజకన్యక గరిమమీఱు,
ఈపంకరుహగంధి యెవతెకాఁబోలును
రతిరాజసతిమాడ్కి రహినహించు,
ఈభవ్యగుణధామ యెవతెకాఁబోలును
పల్కు లేజవరాలిపగిదిఁదోఁచు,
ఈయొయ్యారము లీసొంపు లీబెడంగు
ఈవిలాసము లీతెల్వి యీచతురత
వసుధఁ జెలువొప్ప వర్ణింపవశమె దీని,
అరయ నెట్లుసృజించెనో యబ్జభవుఁడు,

కవిరాజవిరాజితము॥ మరువిరితూపులు మవ్వపుఁజూపులు
మర్మముదూఁటెను నాకపురా !
మురువగుకన్నులు ముద్దగుచన్నులు
మోదమునించెఁ గదూ బళిరా !
సురుచిరయానము సుందరినామము
చూపఱకుం బలు సొంపగుఁగా !
హరిహరి ! యంబురుహాంబకు బారికి
నాఁగఁగఁజాల నిఁకెట్టులొకా !

అయ్యో ! నైపసంకల్ప మేమనవచ్చును. నా కీపాడుబుద్ధి యేలజనించెను. నాతిపఃపరిభావం బెందుఁబోయెను. నే నీమోహసాగరం బెట్లుదాఁటుదును. ఈ మందగమన నాతో నెట్లుసంభాషించును.

బాళి ముమ్మరించెను. రాగ మతిశయించెను. తాప మగ్గలమయ్యెను. తాలిమి దూలిచనెను. ప్రాణము తల్లడిల్లెను. శరీరము వణఁకసాఁగెను. నాతి సురతసుఖ మనుభవింపక బ్రతుకఁజాలను. హా! (మూర్ఛిల్లును)

మే:- (ఆశ్చర్యము నభినయించి)

కం॥ వనజాక్షుల వీక్షించిన
ధన మింతయుఁ దనదు నెదుటఁ దాఁ గనఁబడినన్
వనజాసనునకునైనను
మనమున భ్రమగలుగు నన్నమాట నిజంబౌ,

తొల్లి హాలాహలభక్షకుండగు ఫాలలోచనుండు జగన్మోహినావతారసందర్శనకుతూహలాయత్తచిత్తంబున విష్ణుం బ్రార్థించి యతండు మోహినీవేషంబు ధరియించిన నవలోకించి యింద్రాదిదేవతలు పరిహసింతురని యైనను జంకక వికలుండై మోహింపలేదా? అట్టి సర్వజ్ఞశేఖరుం డట్టుకాఁగ నీ తపసి యన నెంత! తీరినది. పిరిపని మీఱినది. అయినను దీవరింపరాదు. తనంతఁదాను బలుకరించుదనుకఁ బలుకఁ గూడదు, రెండవది స్త్రీల కెంతమోహముండినను బురుషుల బలవంతమునఁ గవయఁగోరుట శాస్త్రవిరుద్ధము. కావునఁ జూతము.

విశ్వా:- (మూర్ఛనుండి తెలిసి కన్నులు నులిమికొనుచు మేనకను వర్ణింపసాఁగును)

మే:- (వినుచుండును)

విశ్వా:- సీ॥ ఈకాంత నెమ్మోము వీక్షించినను జాలు,
అలసుధాకరు చెల్మి సలిపినట్లు,

మే:- (మందహాస మొనరించును)

విశ్వా:- ఈయింతి కచభరం బెసఁగఁ బట్టినఁ జాలు,
కఱకంఠు మెడఁ బట్టఁగలిగినట్లు,

మే:- (పయ్యెద సవరించుకొనును)

విశ్వా:— ఈ లేమకన్గవ నెలమి ముద్దిడఁజాలు,
అజ్జాలయ కటాక్షు మమరినట్లు,
మే:— (ముగ్ధాంగనాచేష్టలఁ గనఁబఱచును)
విశ్వా:— ఈకొమ్మ కెమ్మోవి వీఁక నంటినఁజాలు,
మాధ్వీసుధాహార మబ్బినట్లు,
మే:— (విశ్వామిత్రునే చూచుచుండును)
విశ్వా:— అహాహా ! మఱి యింతికన్న సౌఖ్యంబుగలదె,
అంగజుని రాజ్యలక్ష్మి యనంగఁదనరు
పడఁతిఁ బొందిన జన్మసాఫల్యమగును.
తాళ, నాకేల యీ వెల్తి తపము గపము,
మే:— (పిమలకుఁ గనుసైఁగఁజేయును)
పి:— (వెడలిపోవును)
విశ్వా:— కటకటా ! నే నెన్ని తపములఁ బలవరించినను నెన్నిప్రీమోత్తు లుగ్గడించినను నెంతభ్రమఁజెందినను నెనలేనిశ్రమఁ గుందినను నౌరా ! ఎట్టిసాహసము. స్త్రీహృదయ మెంతకఠినము. కరఁగదుగదా ! అబ్బా ! ఈసుధాకరానన వచనరహితయై యుంట బహుచిత్రముగాఁ గానుపించెడి. నామానస మంత కంతకు నీరగుచున్నది. ఏమిసేయుదును? విరహాగ్ని చల్లార్చు కొను మార్గము దొరకదయ్యె. ఎందుఁబోదును ఏమేని కాని! ఏమేని యనుకొననీ ! ముందుగా నే నీ ముకుతూరి పలుక రించెదఁగాక — (ముందటికేఁజని)

చం॥ కువలయగంధి ! యొంటి నిటకుంజను దెంచిన కార్యమేమి? నీ ధవుఁ డెవఁ? డున్కి యెచ్చటను? దావకమౌ కులవిద్యయెద్ది? - కాంతామణీ! నేనిటు లడుగుచున్నానని సిగ్గుపడకుము. [సీ
ప్రవిమలశీలవృత్తములు భావముఁ గన్గొనఁగా విలోకనో
త్సవమొదవెన్, సవిస్తరము దాఁపక మాకు నెఱుంగఁ జెప్పుమా,
మే:— (కుతూహలమున)

చం॥ మునికులచంద్ర! రావలసి మోదముతో నరుదెంచితిందు, నా
పనిమిటి వద్ద లేఁడు, పని పెద్దయియున్నది, నాకవాసి నే,
స్వామీ! మద్వృత్తాంతము వినవలయునను వేడ్క మీ కేల జనించెనో
సంతసించెద.
వినుమిఁక వేడ్క నాదు కులవిద్యల నెంతయు, నేను దేవతా
ధనసతి, నాటపాటలు సదా యగు మత్కులవిద్య లెన్నఁగన్,
విశ్వా:- అబలా! కడు బడలితివి. కొంచెము విరామముఁ బొందుము.
ఇచటఁ గూర్చుండుము. నీయుదంతము వినఁగోరియే యడిగితిని
మే:- చిత్తము మహానుభావా!
విశ్వా:- శంకయేల ?
మే:- శంకయేమిలేదు. సంతోషమే
విశ్వా:- నీకు సంతోష మొదవిన నాకు సమాధానము
మే:- జటీంద్రా! మీ రుగ్గడించు పలుకు లతిగూఢములు
విశ్వా:- (నవ్వును)
మే:- (మాఱు మొగము పెట్టును.)
విశ్వా:- ఏమిది? మాట గూఢమనియంటివి. మోమువలది ప్పితివి.
ఇందొరు లెవరున్నారు? మన ముఖయులమే కదా!
మే:- ఏమంటిరి ? మనమిరువురమే యున్న నేమి ?
విశ్వా:- అబ్బో! ఎంతటక్కరివే? ఎఱిఁగియెఱుఁగని చందము పలి
కెదవు? తరుణుల నమ్మరాదు.
మే:- తరుణుల నమ్మరాదుగా? పురుషుల నమ్మవచ్చునా ?
(ఇద్దఱు నన్యోన్యము సానురాగముగాఁ జూచుకొందురు.)
విశ్వా:- పంకజాక్షీ! ఇఁకఁజాలును. నన్నేమియు ననకుము. మాట
గ్రహింపుము. మనోభీష్టము నెఱవేర్పుము.
మే:- (ఊరకుండును)
విశ్వా:- (రహస్యస్థలమునకు లాగికొని పోవును.)
ఇది ప్రథమాంకము.



అభినవ శాకుంతలము.

(నాటకము)

ద్వితీయాంకము.

శకుంతల:— (అరణ్యమున బయలుగుండగా మాలినియను నదియొక్క పులినతలంబున శకుంతపరిరక్ష్యమాణయై నిద్రించియుండును)

కణ్వుఁడు:— (శిష్యులతోఁ గూడఁ బ్రవేశించి)

శ్లో॥ శ్రీజానకీహృదయపంకజభాస్కరాయ
శ్రీపద్మచక్రదరశార్ఙ్గగదాధరాయ
శ్రీవత్సకౌస్తుభముఖోరువిభూషణాయ
శ్రీరాఘవాయ విమలాయ సదా నమస్తే,

(అని పరమేశ్వరుని ధ్యానించి) శిష్యులారా! నేఁటివఱకుఁ జిదానందస్వరూపుఁడగు శ్రీమన్నారాయణు నప్రతిమానుగ్రహంబున మన మొనరించు తపస్సు నిర్విఘ్నంబుగా సాఁగుచుండుటచే గృతార్థులమైతిమి. ఇప్పుడు తూర్పుకొండపై విభాకరుండు తోఁచుచున్నాఁడుఁ గాన మనము కాలాతిక్రమణదోష మొదవకుండఁ బావనజలమ్ములఁ గ్రుంకులిడి పంకజబంధు ధ్యానించి సంధ్యావందనాదిక్రియలఁ బరిసమాప్తిగాఁ గావించి పిమ్మట ఫలపుష్పసమిత్కుశాదులం దెచ్చుకొందము.

శి:— మహాత్మా! తమ యిష్టానుసారమే కావించెదము

(కాండజుని నదీసమీపమునకుం గొంపోవుదురు)

క:— (కుతుకమున) ఓహో! ఏమి గాంభీర్యము. ఎంతమనోహరము! రంగదుత్తుంగాభంగతరంగసంగతంబైన యుత్తరంగిణీవతంసము నీక్షించినంతఁ గన్నులపండువయ్యె. ఇది యొకయుత్కృష్టదివసముగా భావించెద. మఱియు మదీయభాగ్యదేవతగా నెంచెద. సంతసించెద. శిష్యులారా! మనవారెల్లరును వచ్చియున్నారా?

శి:— మహాత్మా! వచ్చియున్నారు. ఏమాజ్ఞ

క:— సీ॥ కశ్యపాంగీరస గౌతమాది గరిష్ఠ
శిష్టజనవ్యూహ సేవితంబు
భూరిభూధరదరీద్వారసమాకీర్ణ
ఫలపుష్పవల్లీ విభాసితంబు
రాజహంసరథాంగ రమణీయబకబలా
హాకనీలకంఠసమాశ్రితంబు
కమనీయకల్హార విమలాంబుజసుగంధ
జలజాకరకదంబ సంభృతంబు
శకట శుక శారికా పికనికరనిరత
లలితమాధుర్య సంయుత కలకలంబు
నిబిడ మధుపాంగనా గాన నిస్వనంబు
శీతకలుషంబు నిమ్నాగినీ తటంబు,

నాయనలారా! మన పురాకృతపుణ్యవిశేషంబున నిఖిల కలికృతకల్మషాపహారంబును విహాపరసాధనంబును నైన యిమ్మహానదీదర్శనంబు లభియించినది. నేఁటి యర్ధోదయము మహోదయాదిమహాపర్వములని నమ్మెదు. ఇందుఁ గృతస్నానులమైతిమేని మాతాపిత్రాద్యా

తావంతీ కాశీ గయా ప్రయాగ కురుక్షేత్రముల సేవించిన మహా ఫలంబు నొందనయ్యెడు నని తలంచి యింక నాలస్యంబుచేయక మజ్జనంబాచరించి బ్రహ్మయజ్ఞము పితృతర్పణము మొదలగు వైదిక ధర్మములను విధ్యుక్తప్రకారంబుగా నిర్వర్తించి యిష్టకథాసల్లాపంబులఁ బ్రొద్దుపుచ్చుఁడు.

శి:— చిత్తము.

శ్లో॥ త్వంరాజా సర్వతీర్థానాం త్వమేవ జగతః పితా ।
యాచితం తీర్థమే దేహి సర్వపాపైః ప్రముచ్యతే॥

(అని పఠనము సేయుచు స్నానమాచరించి యుద్ధునఁ దమతమ నేమంబును నల్పుచుందురు)

శకుంతల:— (ఇంచుక యేడ్చును.)

శిష్యులు:— (తలలు పైకెత్తి దిక్కులీక్షించుచు వినుచుందురు)

కణ్వు:— బాలకులారా! మీమీనేమంబులు సాలించి మోముదమ్ములు పైకెత్తి నిక్కి చూచుచున్నా రది యేలరా?

శి:— జనకా ! ఏమియు లేదు. బాలకోకిలధ్వనితో నొకబాలిక రోద నము వినఁబడుచున్నది.

క:— వెఱ్ఱులారా ! దుర్గమంబైన కాంతారసీమ బాలిక యెక్కడనుండి వచ్చినదిరా ?

శి:— ఏమోస్వామీ ! మీరు రవంతసేపు చెవియిడి యాలకించినచో నిజమనుకొందురు.

శకుంతల:— (మరలఁ గొంచెమేడ్చును)

క:— ఔరా ! నిజముగానే యెవరో నినువు కాపుకావుమని యేడ్చినట్లు వినవచ్చుచున్నది. పాపము, దానినిఁ జూచివత్తము

శి:— చిత్తము

క:— (శకుంతలను జూసి, ఆశ్చర్యమున)

కం॥ ఓరా యీయందము, మ
జ్జారె తనూవిభ్రమంబు, సరిరా హొయ్య, ల
య్యారే యీబాలిక యె
వ్వారి కుమారికయొ, దీని వశమే పొగడన్.

సీ॥ కాంబోలునిది సుధాకరునిదౌ బింబంబు,
కాదుకా దకళంక గతి వహించె,
కాంబోలునిది నూత్నకనకపుం బ్రతిమంబు,
కాదు నడవన్గ గానఁబడియె,
కాంబోలునిది దేవకామినీ తిలకంబు,
కాదు విభ్రమవిలోకనములోదవె,
కాంబోలునిది మునికన్యాలలామంబు,
కాదు సుక్షత్రియగాఁగనొప్పె,
గరుడ గంధర్వ కిన్నర కాంతలందు
సిద్ధ విద్యాధరోరగ స్త్రీలయందు
సాధ్య సుర నర ఖేచర సఖులయందు
ఇట్టి సోయగమున్నదే యెంచిచూడ,

(ఎత్తుకొని ముద్దులాడి) ఆహా! ప్రాక్తనజన్మ సుకృతవశంబున నాకీబాలికామణి లభియించినది. దీని కులగోత్ర చారిత్రంబులు దెలిసికొనవలయు. నా యోగదృష్టిమూలంబున నెఱింగెదఁగాక [కొంతతడవాలోచించి] సరి. ఉన్నసంగతినెల్ల గ్రహియించితిని. అప్పటినుండి కరుణారసంబు పొంగిపొరలుచున్నది. ఈ బుడుతను విడిచి పోను కాళ్లాడవు. ఎట్లు పోనును? పోవఁజాల. దీనింగొనిపోయి హృదయానందినిగా

భావించి పెంచుచుండెద. శిష్యులారా! సమిత్కుసుమ ఫలాదులఁ దెచ్చి వారా? కాలాతీతమగుచున్నది. ఆశ్రమంబునకు వెళ్ళుదము.

శి:— ఆర్యా! వలసిన పదార్థంబుల నన్నింటిని సంగ్రహించుకొని వచ్చితిమి. కాని మాకు మొదటి సమాచార మేమియుఁ జెప్పకపోయితిరి. ఏమి సంగతి?

క:— చెప్పెద రండు. (రహస్యముగాఁ జెప్పి శకుంతలాసహితముగా శిష్యుల వెంబడించుకొని యాశ్రమంబునకుఁ బోవును)

దుష్యంతుఁడు:— (ఆస్థానమున సామంత ధరాధిప మంత్రి పురోహిత విద్వజ్జనులతోఁ గూర్చుండి సల్లాపము) అమాత్యశిరోమణీ! మన రాజ్యంబున బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులు మొదలుకొని యష్టాదశ వర్ణముల వారు వారి వారి వర్ణాశ్రమధర్మములఁ దప్పక శాస్త్రోపదిష్ట ప్రకారముగా నిర్వహించుచు నిరంతర విభవ సంపన్నులై స్వకుటుంబరక్షాకరత్వంబు వహించి సుఖంబుగ నున్నవారు కదా!

మంత్రి:— రాజచంద్రమా! యుష్మదీయ శాసనము నతిక్రమింపక యేయేవర్ణములవారాయావర్ణాశ్రమాచారంబులఁ జక్కగా నిర్వర్తించుచు శాశ్వతైశ్వర్యభోగానందపరిపూర్ణులై యున్నవారు.

దుష్యం:— మంచిది. మంత్రిపుంగవా! దేవాలయములయందుఁ ద్రికాల దేవతాసమారాధనాది సత్కార్యములు విధ్యుక్తముగా నెంతయుఁ గొదవలేక నడచుచున్నవా?

మం:— నృపకులచూడామణీ! భవదాజ్ఞానుసారముగా సకలదేవతాగ్రహాములయందును మూఁడువేళలం దప్పక యర్చకులు కాలాతిక్రమణము గాకుండునటుల స్వామిపూజాధురంధరులై కాలం

బు గడపెదువారే కాని వ్యతిరేక మించుకయు నొనరించినవిధ మగుపడదు.

దు:— సరే. మతిమంతుఁడా! రాజకీయములన్నియు శుభావహముగా నిర్వహింపఁబడుచున్నవా?

మం:— మహీధవా? సర్వకార్యములును నిర్విఘ్నముగా నెఱవేఱుచున్నవి. ఏవిధమైన లోపమును గానఁబడదు.

దు:— అట్లైన సంతోషము. ఇంక మన రాచకార్యములు చాలించి భోజనమునకుఁ బోవుదము.

మం:— చిత్తము. ఆలాగే కానిండు (ఇరువురు నిష్క్రమించు సమయమున నార్తధ్వని వినఁబడును.)

దు:— (ఆలించి తీవరమున) సచివా! అదియేమి. ఆర్తధ్వని వినవచ్చెడిని.

మం:— భూపాలకా! ఆస్థానమున కెవరో వచ్చుచున్న భంగిఁ దోఁచుచున్నది. విచారించి యరుగుదము. కొంచెము విశ్రమింపుఁడు.

దు:— సరే

పౌరులు:— (విషాదపడుచు రాజుముందటికి వచ్చి)

మత్తకోకిల॥ దండ మోధరణీశ! మా మొఱ
తప్పకుండ వినుండికన్,
గండుబెబ్బులు లెల్గు లేదులు
కాఱుదున్నలు లావుకల్
కొండకోఁతులు గండకంబులు
క్రూరసత్త్వము లెంతయున్
అండఁబాయక పైరులన్నిటి
నంతముం బొనరించెఁగా,

పౌరు:- దొరా! నిన్నటిరేయి కార్స్మికంబు లెన్నేనియు వచ్చి మా
జొన్నచేనులన్నియుఁ బాడుచేసినవి.

మత్తకోకిల॥ దిక్కులేదిఁక దిక్కులేదిఁక దిక్కులేదిఁక భూప! మే
మెక్కడైనను వెళ్లిపోయెద మిల్లు పిల్లలఁ బాసి హా!
మొక్కలన్నియు మేసివేసెను ముందుముందె మృగావళుల్,
దిక్కుమాలినవార మైతిమి, దీనికేమి వచింతువో,

ఒడయఁడా! దుష్టసత్త్వములబారిఁ బడఁజాలక కాఁపురముల విడిచిపోవుదుమా? ఇదివఱకే కడుబడలితిమి. క్రూరమృగంబుల గెడపలేని బ్రతుకలేము.

దు:- బిడ్డలారా! ఊఱడిల్లుఁ డూఱడిల్లుఁడు. భయపడకుఁడు

పౌ:- తే॥ ప్రజల విన్నపములఁ గాపాడుమయ్య,
ఎన్న సెలవిచ్చియుంగద లెఱుఁగమయ్య,
క్రూరమృగములబాధ దప్పించుమయ్య,
తాళలేమయ్య మాయయ్య దండమయ్య,

చెయ్యెత్తి మొక్కువారము. స్వామీ! ఇంకమా చేలఁగాను మన్నింపుఁడు.

దు:- తే॥ కాలవశమున నేతెంచుఁ గష్టములును,
జగతి సుఖదుఃఖములు రెండు సమములంచు
సంతసించిన దైవంబు సమ్మతించి
ప్రోవఁగలవాఁడు, దీనికై పోగులనేల,

పౌరులారా! శాంతిఁబొందుఁడు. సూర్యోదయంబున వేటాడవచ్చి దుష్టసత్త్వంబుల వధించి జగత్సంక్షోభము నివారించెద. సుఖముగా నుండుఁడు.

పౌ:- రాజేంద్రా! జోహారు జోహారు. మాకు సెలవొసంగుఁ

దు:- జనులారా! పోయిరండు

పా:- పోయివచ్చెదము.

దు:- సచివా! మనరాష్ట్రమున నింతకులోఁగా నిట్టియుత్పాతములు సంభవించినవా?

మంత్రి:- ధరణీశ్వరా! మీసత్యపరిపాలనమున నెన్నఁడు వినియుండ లేదు. నేఁడే యీవింత పొడమినది.

దు:- ఐన దీనికి యోజన యెట్లు?

మం:- మఱి మీ రేమందురు?

దు:- తే॥ రాజ్యసంక్షోభ ముడుపుట రాజధర్మ,
మటులఁగాదేని సమగూఱు నపయశంబు,
ఆత్మవత్సర్వభూతాని యను సదుక్తి
మదిని భావించి మెదలుటే మనకు లెస్స,

ఇదియునుంగాక పార్థివులకుఁ బ్రజాపరిపాలనమే పరమ ధర్మము గావున ధర్మవిరోధ మొనరింపక రేపు ప్రాతఃకాలమున మృగయావినోదమునకై వెడల నిశ్చయించితి. ఇందుకుఁ దగిన సైనికుల నాయితము గండని యాజ్ఞాపింపుము.

మం:- చిత్తము. (అని రాజుతోడను వారలందఱను నిష్క్రమించును)

ఇది ద్వితీయాంకము.



అభినవ శాకుంతలము.

(నాటకము)

తృతీయాంకము.

కణ్వుఁడు:— (శకుంతలయు శిష్యులుం గూడను బ్రవేశించి)

సీ॥ వేదాంతశాస్త్రార్థ మెనని దప్పక నేఁడు
సక్రమంబుగ మీరు చదివినారె,
తర్కనిరుక్తవైద్యవ్యాకరణధర్మ
శాస్త్రపాఠము వేడ్క నల్పినారె,
రామాయణాది సద్గ్రంథాంతరరహస్య
నీతిసారము విననేర్చినారె,
నవరసాలంకార సత్ప్రబంధముల్
క్రమముగా నేర్పుగాఁ గడఁగినారె,
గానసంగీతసాహిత్య సత్కథాని
ధానులై వైదికములైన ధర్మములను
విడువకే వృద్ధసమ్మతి నడచినారె,
చెప్పుడురు రండు వెస నాదు శిష్యులార !

శి:— (మునీంద్రునకు నమస్కరించి) విద్వచ్ఛిరోమణీ! శ్రుతిస్మృతీతిహాసపురాణకథాప్రసంగంబుల నింతసేపుఁ గావించి సామగానము నొక్కింత గావించితిమి.

మఱికొందఱుశిష్యులు:— నాయనా! మేము స్వాధ్యాయపాఠములను జక్కఁగా నేర్చియున్నాము.

క:— మఱి మీ రేమిచేసితిరి?

శి:— స్వామీ! యుష్మదీయానుగ్రహంబువలన యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణా సమాధ్యష్టాంగ యోగానుష్ఠానములఁ బ్రొద్దుబుచ్చుచుఁ బరబ్రహ్మమును దర్శించుమార్గము నభ్యసించినారము. మునీంద్రా! యీశిష్యుఁడు వైదికధర్మమును బాగుగా సంగ్రహించినాఁడు.

క:— (సంభ్రమమున) కుమారకులారా! ప్రజ్ఞాసాంద్రులరగు మీమీ వాచావిభవంబునకు నామానససంతోషవారాశి నోలలాడుచున్నయది. ఇఁకమీఁద మీపాఠములఁ జాలించి కాలోచితకృత్యముల నొనరించుచుండుఁడు. నేను సమిత్కుశఫలాహరణార్థం బియ్యరణ్యమునకు శీఘ్రముగా నరుదెంచెద.

శకుం:— (తండ్రిని సమీపించి) జనకా! నమస్కరించెద. మీ రెక్కడి కో యేగఁదలంచుచున్నారు?

క:— తల్లీ! నేను గందమూలఫలాదులు సంగ్రహించి తెచ్చుటకై కాంతారంబున కరిగెద.

శ:— నాయనా! నన్ను వెంబడించుకొని పొండు.

క:— కుమారీ! దుర్గమంబైన గహనసంచారమున నీ వోర్వలేవు. కుటీరమున నివసింపుము. నే నిప్పుడే యేతెంచెద.

శ:— కాదు తండ్రీ! నన్ను వెంటనే తీసికొని వెళ్ళుఁడు. నే నొంటి నుండఁజాల

క:— పుత్రీ! ఒక్కతెవే యుండవలయునని సంశయించెదవేల? నీ యన్న లందఱు నున్నారుగదా!

శ:— జనయితా! అన్న లుండినను నక్క లుండినను నేను మాత్రము మీ వెంటనే వచ్చెదను. ఎప్పుడు వచ్చినను వలదందురు. మీతో రాఁగూడదా?

క:— అమ్మా! నేను మరల నరుగునప్పుడు నిన్నుఁ దోడ్కొనిపోయెదఁ గాని యిప్పుడు వలదు. నీకు మంచిమంచిఫలపుష్పములు తెచ్చి యిచ్చెద. నన్ను విడువుము. అన్నల చెంతకు నామకొనఁబొమ్మా

శ:— మఱి మంచి ఫలపుష్పములను నాకుఁ దెచ్చియిచ్చెదవా?

క:— చిఱుతా! అవశ్యము తెచ్చెదను.

శ:— అయిన మీ రెప్పుడు వచ్చెదరు?

క:— పట్టీ! [illegible] చెద. చింతిల్లకుము.

శ:— అటులైన [illegible]ము. (అందఱు నిష్క్రమింతురు)

మృగయులు: (అరణ్యప్రదేశమున దుష్యంతసహితముగాఁ బ్రవేశించి)

సుగంధి! పట్టపట్ట పెద్దపులులు పాఱిపోవసాగెరా,
కొట్టకొట్ట చూచెదేమి కొండదున్నపోతులన్
పెట్టపెట్ట మాటు జింకపిల్ల లిందె వచ్చెరా,
నెట్టనెట్ట దుప్పిపిండు నిల్చినిల్చి యియ్యెడన్,

అబ్బబ్బో! యేమడవిరా [illegible]. ఏహే! ఏమి మెకాలో యివి. అన్నన్నా! చిలుకల దండును జూచినారురా?

మఱియొకఁడు:— అప్పుడే చూచినా మిస్సీ!

మృగ:— బోతురా చిన్నచిన్న పిట్టలఁబట్టుటకై యీ దెస నురులను వైచి కఱకు [illegible]ముల మీఁదికి మొఱకు జాగిలములఁ దోలుదమా?

మఱియొకఁడు:— తోలుదము తోలుదము

మృ:- బిరుదా! అదిగో వచ్చెఁ వచ్చె

మఱియొక:- ఎవ రెవరు?

మృ:- ఎవరు లేరు. మేటిమగఁడైన వేటకాఁడు. సూటిగా నాఁట నేసిన నొక మేటిసింగము గీటడంగినది.

మఱి:- సరే సరే. వేటరులారా! మొదట వెనుకకుఁ దిరిగిచూడుఁడు. అల్లదే మృగములు పరువులిడుచు మనపైకే వచ్చుచున్నవి. ఇంక నేమిసేతము? హాహా! రాజేంద్రా! మాశక్తికి మీఱినది. రక్షింపుఁడు రక్షింపుఁడు.

మ:- (ధైర్యమున) మృగయులారా! భీతిల్లకుఁడు భీతిల్లకుఁడు. ఇదే వచ్చితిని.

మృ:- బ్రతికితిమి బ్రతికితిమి.

మ:- యుగంధరా! మన రథమును దివరము నడిపింపుము. ముందఱి సైన్య మొక్కుమ్మడి నల్లకల్లోలమగుచున్నది.

మం:- చిత్తము.

మ:- మానిని.

గండకభల్లుక కేసరిరోహిత కాసరభల్లుక చామర వే
దండ కురంగఫణీంద్రములుం గడుదాపునకుం జనుదెంచె నహా!
చండమృగంబుల గండడఁగింపని శౌర్యము వ్యర్థముగాన మహో
ద్దండమదీయ సుకాండములన్ వెస దర్పమెలర్ప వధింతు నికన్,

శూరులారా! మీరు వెనుదీయక నానావిధసాధనంబులఁ గైకొని నావెంటనే నడువుఁడు. నేఁడు మృగయావినోదము చక్కఁగా నొనరించెద.

మృగ:- పుడమితేఁడా! అలాఁగ వచ్చెదము

దు:— పుళిందులారా! మదీయధనుర్విద్యా కౌశలంబునఁ జటుల భయద వనాటసముదయంబులఁ బోనీక శిక్షించితిని. వేట కాండ్రు వేఁటచాలించి రాలేదా ?

మృ:— చాలించిరి

దు:— పౌరులారా! క్రూరసత్వముల బాధ నిర్మూలమైనదా ?

పౌ:— దేవా! మీయనుగ్రహంబున నివారణమైనది

దు:— ఇఁక నేమియు భయములేదుకదా!

పౌ:— లేదు స్వామీ! లేదు

దు:— సంతోషము సంతోషము

ఉ॥ మానవులార! దుర్గ్గనగసానువులు పెంచమడంగె, నింక నెం
తేని ముదంబు మీరఁ బురంబున కేగి మీరు స
న్మానములర్చ స్వీయసుమనోవరరాజముల౯ వసించుచు౯
శ్రీనిధులై యనారతము చింతయెఱుంగని సుఖంబుఁ బొందుఁడీ,

ప్రజలారా! మీకెల్లరకు క్షేమమగుఁగాక. ఇంక మీమీ యిమ్ములకరిగి బంధుమిత్రపుత్రకళత్రాదులతో బహుకాలము జీవంతులై సౌఖ్యంబుల నుద్ధరించుకొండు. సరిగఁబొండు.

పౌ:— మహాప్రసాదము (అని నిష్క్రమింతురు.)

దు:— మంత్రివరా! మన మిందరుగుదెంచిన కార్యము చక్కనయ్యెఁగా!

మం:— మహీశా! క్షేమమైనది. మా సైన్యంబుల నెగచిచంపెను వేఁటక నతిదూరంబున కరిగిన మన సైన్యంబు ననుగమింపనోపక నమధిక క్షుత్పిపాసాపరిశ్రాంతు లయ్యుయీప్రదేశంబుల విశ్రమించిరి.

దు:— సహచరా! అవును. ఆఖేటంబున జనియించిన పరితాపము నుపశమింపఁజేసికొనుటకు విశ్రమించిరి కాఁబోలు. వారంద్రు సేదదీర్చు

కొనునంతవఱకు మనముగూడ మార్గాయాస మించుక బాపి కొందము. ఇం దెందైన జలము దొరకునా? నాకు మిక్కిలి దాహమగుచున్నది.

మం:— నరేంద్రా! ఇచ్చట లేదుగాని గవ్యూతిదూరంబున మాత్ర మొకజలాశయ మగుపడుచున్నది.

దు:— అయిన నటకేగి దాహమార్చుకొనిన త్తము పద

మ:— అటులనే చేయుదము (అందఱు నదియొద్దకేగి సలిల పానము చేసి కూర్చుందురు. తత్సమీపమున నొకశృంగారవన మగుపడును)

దు:— (శృంగారవనము నవలోకించి) సచివోత్తమా! ఇప్పుణ్య నదీతీరంబున వివిధసురభికుసుమఫలభారవినమ్రతరులతాగుల్మ పరిశోభితంబైన యొక యారామంబు గనంబడియె. ఇందుఁ గొంతవడి విహరించి పోవుదము.

మం:— తమ యిష్టానుసారమే వర్తించెదము.

దు:— (ఉపవనములోనికిఁ బ్రవేశించి యాశ్చర్యమున)

తే॥ అమరపతి ఖాండవమునకు రమణ వైశ్ర
వణుని చైత్రరథాహ్వయవనమునకును
సమముగానుండ దీనిని జలజభవుఁడు
పొసఁగ రచియించెఁబోలు, హా! పొగడ వశమె,

మఱియును

లయగ్రాహి॥ కమ్మని రసాలమహీజమ్ముల నశోకనిక
రమ్ములను జంపకచయమ్ములను హింతా
లమ్ముల గురంటకవటమ్ములఁ గరీరకుట
జమ్ములఁ బలాశనివహమ్ములను ఖర్జూ

రమ్ములఁ దమాలసరళమ్ములఁ గపిత్థపన
సమ్ముల శిరీషక[illegible]మ్ములను జంబీ
రమ్ముల జపాక[illegible]కమ్ములను [illegible]
నమ్ము రహిమీఱఁగను నసయుమన్నఁ గనుపించెన్,

ఓహో! హృదయసుఖావహంబగుచున్న యువ్వనంబు వీక్షింప నాకన్నుల కత్యద్భుతముగనున్నది. మఱికొంతద వ్వరిగి యిందలివిశేషముల సక్రమముగా నవలోకించి తృప్తిఁబొందెదఁగాక. (కొంచెముదూరము పోవు) ఆహా! చూడఁజూడ [illegible] లగపడుచున్నవి.

సీ॥ అనవరతాభినంద్య ధరాసురులతోడ
వేదా[illegible]ధులతోడ
ఆహావనీయాది యా[illegible]
[illegible] విమర్శనములతోడ
[illegible] ధ్వనులతోడ
అనఘమహితబోధనులతోడ
కృష్టకథాలాపశిష్టజీవికతోడ
అతులవిద్వత్సమూహంబుతోడ
శారికాకీరకలహంసచయముతోడ
పరిరుచిరసుగంధజలజాకరములతోడ
త్రిభువనానందకరముగఁ దేజరిల్లె
ఇమ్మహాముని యాశ్రమము, మేమిగలదు,

అమాత్యులారా! ఇయ్యది [illegible]మహాముని యాశ్రమంబని యెఱుంగుఁడు. నేనమ్మహాత్మునకు నమస్కరించివచ్చెద. నావచ్చునంత కంద [illegible]చ్చోటనె యుండుఁడు.

మం:— త్వరగాఁ బోయిరండు

శ:– (కణ్వమహాముని మందిరముననుండి తనలో) నేఁడు మానాయనగారు కందమూలఫలప్రసూనసంగ్రహణార్థ మిక్కాననంబున కరిగియుండెరు. మధ్యాహ్నము సమీపించినది. ఇంతకుం జనుదేరకుండిన హేతు వెయ్యదియో తెలియదు. విచారించిచూడ వారుపోయినస్థలంబున నెవ్వరేని మహనీయులు గలసియుండ వచ్చును. లేనియెడల నింతసేపు నిలిచియుండుటకు నితరకారణ మగుపడదు. (అని మెల్లమెల్లగాఁ బ్రవేశించుచు నాహ్లాదముతో మరలఁదనలో) నాకిప్పటికి మదీయభాగ్యదేవతయునుం బోలె లక్ష్మీపతిలక్షణలక్షితుండగు నొకపురుషుం డరుగుదెంచుచున్నాఁడు. ఆహా! ఇతని రూపయౌవనవిలాసంబులఁ దిలకింప నరుదయ్యె

సీ॥ అభినవపంచసాయకుమాడ్కి రహించు
నీసుందరాకారుఁ డెవ్వఁడొకొ,
జలజబాంధవుని తేజమునఁ జూపట్టెడు
నీభవ్యగుణశాలి యెవ్వఁడొకొ,
శరధిగాంభీర్యంబు కరముగ్గి పరంగు
నీశరేజనిభాస్యుఁ డెవ్వఁడొకొ.
ధరణీధరంబుల ధైర్యంబు నిరసించు
నీపుణ్యవారాశి యెవ్వఁడొకొ,
సురనరోరగగరుడులఁ జూడమొకొ,
ఖచరగంధర్వతనయులఁ గాంచమొకొ,
సిద్ధవిద్యాధరులను వీక్షింపమొకొ,
ఇమ్మహామహునకు సాటి యెవరు తలఁప,
నేజన్మమెత్తినయంతనుండి యెన్నఁడు నిట్టిరూపవంతుని దర్శిం

చినదానఁగాను. నేఁడు వీక్షించినకతన ధన్యురాలనైతిని. ఇయ్యవతారము యథార్థముగాఁ దర్శింప జగన్మోహనావతారమే.

ఉ॥ భూరివిలాససంపదయుఁ బూర్ణకళానిధినేలుమోముఁ శృం
గారము చారుహాసము నిగారము చేరలఁ గేరుకన్నులిం
పారెడు బాహుయుగ్మము నపారసులక్షణ మీయొయ్యార మ
య్యారె! నుతింపఁగాఁదరమె, హా! మతియన్నియు వీనికే
(తగుల్,

ఇ వసంతవిలాసంబున విహారితనజయంతుఁడువోలె నున్న యితండు దుష్యంతమహాకాంతుండుగాని యనుమానింపఁగాఁడు. కావున నితని కతిప్రియంబున నతిథిసత్కారంబాచరించినపిమ్మటఁ గుశల ప్రశ్న మొనర్చెద. (ముందరికివచ్చి) (ప్ర) మహీరమణా! మదీయవిజ్ఞాపన మాలకించి నాచే నొనరింపఁబడిన యతిథిసత్కారంబు లంగీకరింపుము. ఇయ్యుచితాసనంబుపై నధిష్ఠింపుము.

దు:- (కూర్చుండును.)

శ:- (అర్ఘ్యపాద్యాదివిధులం బూజించి)

మత్తకోకిల.

క్షేమమే గురుబాంధవాళికి, శ్రేయమే నిజరాజ్యమం,
దోమహీశ! శుభంబె నీసుతయోషిదాదులకుం గడుర్,

దు:- కోమలాంగి! సమస్తరాష్ట్రముకున్ సదా పరిణామమే,
భామినీతనయుల్ హితుల్ సుఖభావుకంబున నుండిరే,

శ:- ధారుణీశ్వర! నేఁడు మీరు ముదంబుతో నిటువచ్చు నే
కారణంబునొ నా వచింపుము గ్రక్కునన్, వినఁగోరితిన్,

దు:- కారణంబును విన్ము చెప్పెదఁ, గణ్వునిం గనిపోవఁగా
వారిజాంబక! వచ్చినాఁడను, వారలెచ్చటి కేగిరో.

శ:— అయ్యో కానకుఁ బండ్లుదేర నిజాశ్రమంబెడఁబాసి తా
నియ్యెడం జనె, వచ్చు మీస్థితి యెంతయుం వినినంతటన్

దు:— శయ్యానం జనుదెంచునో మఱి సంయమీంద్రుఁడు లేఁడొ, ప్రా
ద్దయ్యె, మా సదనంబుకేగెద మంబుజానన! వైళమే,

శ:— శ్రీనరాధిప! మీరు లోకముహూర్తమాత్రము సైపుఁడ
ప్పన్మునివర్యుఁడు వచ్చునంతకు మత్కుటీరములోపలన్,

దు:— మీనలోచన! నీసుసద్గుణ మెన్నఁ జిత్రము, మెచ్చితిన్,
మానినీమణి! మంచిమాటయె, మాకు సమ్మతమయ్యెఁబో,

(తనలో) ఇక్కుసుమకోమలి భయభక్తి వినయంబులకును నతులితమృదుమధురగంభీరవచనరచనాచమత్కృతులకును నాహృదయపంకజము పల్లవించుచున్నయది. మఱియు, మనోజసామ్రాజ్యలక్ష్మీవల్లె సర్వలక్షణలక్షితంబులగు దీనిసర్వావయవముల వర్ణించుటకు నాదిశేషునకైన నలవిగాదని యూహింపనయ్యెడిని

సీ॥ జలజారి నలరించుఁ గలకంఠి నెమ్మోము,
వెలిదామరల నేలు నెలఁత కనులు,
అళిపాళి గెదరించు లలితాంగి పెన్నెఱుల్,
కొదమసింగముఁ గెల్చు సుదతి కౌను,
మదనాగముఁ గలంచు మదిరాక్షి యానంబు
శ్రీకారముల మీఱుఁ జెలువ శ్రుతులు,
గురుశైలముల మించుఁ దరుణి వక్షోజముల్,
తిలపుష్పరుచిఁ గొను వెలఁది నాస,
అబ్జినీతతి నొంచు నళివేణి బాహువు,
లనఁటుల నెడసేయు నతివ తొడలు,
కలికిచూపులు పలుకు లగ్గలపువలపు
చెలువు జిగి బిగి నిలుపు క్రొందళుకుబెళుకు

ముజ్జగంబులవలపించు, ముద్దుగుమ్మ
నలువ యేలీల సృజియించినాఁడొ పుడమి,
మత్తకోకిల.

ఇంద్రనీలమణి ప్రవాళము లిందుఖండము తారకల్
చంద్రికాతతి కందముల్ దరచక్రము ల్ఫణి యుద్ధముల్
సాంద్రమౌ బిసబింబకచ్ఛపసారసంబులు దీని ని
సంద్రలీల సమాశ్రయించుఁగదా ! విచిత్రముచూడఁగన్,
ఆహా ! ఇట్టిసుందరి యింటల కేల వచ్చునదియో తెలియదు.

ఇదియునుంగాక

శా॥ ఈలీలావతిఁజూచి నామదికి నెం[illegible] ప్రియంబయ్యె, నీ
బాలారత్నముఁగన్న పు[illegible] పాటింపఁగారాదు, స
చ్ఛీలం బుత్తమ[illegible]ము ల్పొతిరింబు [illegible]హింపఁగా,
వాలాయంబు [illegible] తెన్నయగు నివ్వామాక్షి చందంబులన్,

మఱియు, ఈబాలికామణి వృత్తాంతము తెలియునంతవఱకు నామనంబు తృప్తవహింపఁజాలదు. దీని కులగోత్రాభిధానముల నరసి కదా ముందటిప్రయత్న మొనరింపఁదగినది. ముమ్ముందుగా దీనిసంగతి నంతయు విచారించెద (ప్ర)

చం॥ జలరుహగంధి ! నీవు సరసప్రియభామిని మెల్లనంగ నా
కెలమి జనించుచున్నయది, యిట్టి సుహాసవిలాసవిభ్రమం
బులఁ [illegible] సుందరివి భూతలనంబున కేలవచ్చితో
ఇలఁ దలిదండ్రు [illegible] యెట్టివో నీస్థితి చెప్పు మంతయున్,

నీ యుదంతము సక్రమంబుగా వివరించి మన్మనస్సంతోషము గావింపుము.

శ:– మ॥ జగతీవల్లభ ! విన్నవింతు వినుమీ; శాంతుండు వేదాంతపా
రగుఁ డత్యంతయశఃపరీతుఁడు తపఃప్రాజ్యప్రభావుండు శా

త్రిగరిష్ఠుండు కృపాసముద్రుఁడు సదాచారుండు ధీరుండునాఁ
దగు నాకణ్వమహర్షి ముద్దుతనయన్ దర్శింప నిక్కంబుగన్,
భూపాలచూడామణీ ! మదీయ వృత్తాంతము నాలకించితిరా ?

దు:— కామినీమణీ ! వింటిని. కడుఁ జిత్రముగానున్నది.

శ:— రాజేంద్రా ! ఉన్న సంగతి వచియించితిని. ఇందాశ్చర్య మేము న్నది ?

దు:— లేకయేమి ? ఉండనేయున్నది.

శ:— ఏమి ?

దు:— తే॥ తన్వి ! యాకణ్వుఁ డెంతయుం దాపసుండు,
అదియుఁగా కూర్ధ్వరేతుండు ననఘచరితుఁ
డమ్మునికి నెట్లు కూఁతురవయితొ యావు
దీని సంకనాకు నెఱిఁగింపు తేటపడఁగ,

శ:— పుడమిఱేఁడా ! దీనికా మీకు విచారము గలిగినది ? అయిన వినుండు. ఒకనాఁడు తన్నొక్కసకానివర్యుఁ శిశకుంతల యను కన్యక యెక్కడిది? దీనిజన్మ మెవ్విధ మని యడుగ నేను విను చుండఁగా నిట్లు విన్నవించెఁ, గాన నాజన్మప్రకారంబు మాయ య్య యత్తపోధనునకుఁ జెప్పినవిధంబున మీకు వాక్రుచ్చెద. దత్తావధానులరై యాలకింపుఁడు.

సీ॥ ఘనుఁడు విశ్వామిత్రమునివల్లభుఁడు ఘోర
తపము సేయుచునున్న తఱి యెఱింగి
వేల్పుఱేఁ డెంతయు వెఱచి మేనక యను
అప్సరోంగనఁ బంప నదియు నతని
అతులతపోవిఘ్న మాచరించిన వేళఁ
దత్ప్రసాదమున సత్తరుఁ గేను

జనియించుటయు నాదు జనయిత్రి మాలిని
సైకతస్థలి డించి చనియె దివికి,
కుతుకమునను శకుంతములు బ్రోచి రక్ష
సేసె, నటుమీఁద నొకనాఁడు శిష్యగణము
గొలువ నీతాపసుఁడు వచ్చి కోరి యిటకు
దెచ్చిపోషించె నను బలుమచ్చికలర,

అట్లు మహానుభావుండు శకుంతరక్షితనగుటం జేసి నాకు శకుంతల యను నామంబిడి కరంబు గారవించుచుండె.

దు:— (తనలో) నేనిది మునికన్యక యని యెంచుకొనిన స్పృహావృత్తినున్నను రాజపుత్రియని నిజాభిజ్ఞానము [illegible] గ్రహింగించుటయు నాహృదయము మదనబాణహతికి [illegible] స్పదమై యతిపాతవికంపిత పంకజమువలె [illegible] చుండె. కాని యిక్కోమలి నుపలక్షింప నాయందు [illegible] యనురాగము జనించినకరణిఁ దోఁచుచున్నది. సమయానుకూలముగా దీనితో నొక్కింతసేపు సంభాషించెద. (పైకి)

సీ॥ కమలాయతాక్షి! ఈ కపిభయంకరమైన
కాంతారమునఁ బ్రొద్దుగడపనేల?
లలితాంగి! ఈ వల్కలాజినంబులు గట్టి
పడరాని యిడుములఁ బడఁగ నేల?
బాలరో! ఈ కందమూలములు భక్షించి
దేహంబు కృశత సేయనేల?
సుందరి! ఈ దివ్యసుందరాకృతిఁ బూని
యుండియు మునిపల్లె నుండనేల?
లలిత! నీరూపలావణ్యవైభవములఁ
గాంచ నంతసమయ్యె, బల్గౌరవమున

గరిత ! నా కీవు భార్యవై కనద శేవ
రాజ్యసౌఖ్యములందు మోరాజవదన !

కలికీ ! ఇంచుక మదీయధర్మప్రసంగము నాకర్ణింపుము. లోకంబున బ్రాహ్మంబును, దైవంబును, నార్షంబును, ప్రాజాపత్యంబును, రాక్షసంబును, నాసురంబును, గాంధర్వంబును, పైశాచంబును నన నెనిమిది వివాహంబులు గలవు. అందు క్షత్రియ వైశ్యులకు గాంధర్వ రాక్షసములు కడుఁ బ్రశస్తంబులు. మనము క్షత్రియులము గావున ధర్మపథము విడనాడక నను గాంధర్వవిధిం బరిణయము చేసికొని నిరంతరము సుఖింపుము. సంశయింపకుము.

శ:— (లజ్జావనతవదనయై యూరకుండును)
దు:— అబలా ! ఏమి యూరకుంటివి ?
శ:— (ఇంచుక వ్రీడాసంభ్రమములతో)

కవిరాజవిరాజితము.

ఘనుఁడు తపస్వియు గౌరవధుర్యుఁడు గాన మదీయగురుండు దయా
వననిధి యమ్మునివర్యుఁడు నింతకు వచ్చును, నాయన వచ్చియు నె
మ్మనమున సంశయమందక నీ కగు మన్నన సేసి యొసంగును, భూ
జనులు నుతింపఁగ సమ్మద మొప్ప ధరాధిప! పెండిలియాడుము నన్,

దు:— యువతీ! ఏల సంశయించెదవు? నాపలుకు లేల యాదరింపవు?
శ:— నృపసత్తమా ! తండ్రియనుమతి లేక యికార్యము నొనరించుటకు సాహసింపఁజాల. ఆయన నాకు భయత్రాణయగుటం జేసి శంకించెద. అన్యథా విచారింపకుఁడు.
దు:— తే॥ ఇంతి ! అమ్మునిరాకతో నేమికార్య ?
మాత్మ నర్పించుచోఁ దాన యగును గర్త,
గాన గాంధర్వవిధి నీను పాణి నేఁ గ
హింతు మాఱాడ కిద్దాని కిష్టపడుము.

(అని గాంధర్వ వివాహ స్వరూపమును రహస్యముగా బోధించును)

శ:— రాజోత్తమా ! నేనుగ్గడించిన పలుకులకు సమాధానమొసంగి తియ్యనిమాటలచే నాహృదయము గరఁగించుచుంటిరి. ఏమి చేయుదును. స్త్రీలు స్వాతంత్ర్యహీనలుగదా !

దు:— తరుణీ ! వృథాకాలయాపన మొనర్పకుము. నీకును నాకును బరస్పరానురాగంబును గాఢము ండు పెంపఁబొంగెను. కాన నెడసేయక నన్నేలికొనుము. ఇంక నోర్వఁజాల

శ:— భూపా ! నృపులు కార్యవాదులు. తరుణులయెడల సనృతంబు లాడి లోఁబఱచుకొన యత్నింతురు. మిమ్ము నమ్మఁగూడదు.

దు:— ఇంతీ ! ఎంతమాటాడితివి. నన్ను సూనృతవాచాధురీణుఁడని యెఱుంగవుకాఁబోలు.

శ:— రాజేంద్రా ! మీరు లోకవిఖ్యాతులైన నామనోభీష్టము నెఱ వేర్తునని నుడివినచో ...

దు:— నామనోరథము కొనసాగింతునా !

శ:— నిశ్చయముగా మీయిష్టప్రకారమే వర్తించెదను

దు:— అయిన నేమియడుగఁదలఁచితివి ?

శ:— చిత్తగింపుఁడు

చం॥ ఒడయఁడ ! నేను నీవలన నొక్కకుమారుని గాంచిన యా కొడుకును యౌవరాజ్యమునకుం గృపతో నధికారిఁ జేయఁగల దడవొనరింపకుండ వరదానము సేయుము, నీకు నాకు ని య్యెడ సత్యులైన సంగమము నిచ్చ ముదంబున సంఘటిల్లెడిన్,

దు:— లలనా ! నీబుద్ధికి మెచ్చితిని. నీవుగోరినవరం బిచ్చితిని. గ్రహింపుము.

శ:— మహాప్రసాదము (ఇరువురు నిష్క్రమింతురు)

ఇది తృతీయాంకము .



అభినవ శాకుంతలము.

(నాటకము)

చతుర్థాంకము.

(శకుంతలయు దుష్యంతుఁడును ప్రవేశింతురు.)

దు:- కాంతామణీ! నేను గాంధర్వవివాహమూలంబున నిన్నుఁగూడి యభిమతసుఖంబుల ననుభవించితిని. ఇంక గేహంబున కేగెద. నిన్నుఁ దోడ్కొనిపోయే తేరుఁ బిమ్మట నస్మత్ప్రధానవర్గంబును బంపించెద. వారివెంట నీజనకుని యనుమతింబడసి యేగుదెంచుము. నిలువుము

శ:- నాథా! చిత్తము. అట్లే కానిండు

దు:- (నిష్క్రమించును)

కణ్వుఁడు:- (ప్రవేశించి)

ఆ॥ నాకుమారి! రావె, నాముద్దుసుత! రావె,
కూన! రావె, చిన్నికుట్టి! రావె
నాయనుంగ! రావె, నాపాప! రావె, నా
తల్లి! రావె, కల్పవల్లి! రావె,

అమ్మా! శకుంతలా! నీకొఱకు మంచిమంచి ఫలపుష్పములు సంగ్రహించి తెచ్చితిని. రమ్ము

శ:- (మెల్లమెల్లగా సిగ్గుతోఁ గణ్వునియొద్దకుఁబోవును.)

క:- (తనలో) నేను ప్రతిదివసము నరణ్యమున కేగి యరుదెంచువఱకు నెదురుగాఁజను దెంచి "నాయనా! నాకు ఫలములి" మ్మని పల్కుచుండెడి నాబాలికారత్నము నేఁడు పిలిచినను నాపాలికి వచ్చుటకు సంశయించుచున్నది. ఇది యేమి చిత్రమో యోజింపవలెఁ గాక ([illegible] దివ్యదృష్టింజూచి) ఆహా! నాదివ్యజ్ఞానము చేత దీనిసమాచారమంతయు నెఱింగితి. క్షత్రియులకు గాంధర్వవివాహము విధిచోదితము. కానిమ్ము. మంచికార్యము చేసినది. ఇందుకు సంతసించెద. ([illegible] శకుంతలం గనుగొని)

(ప్ర) భయపడకుము.

ఉ॥ నీకులగోత్రశీలముహా [illegible] భంగిగఁ
బ్రాకటమూ [illegible] బాలుని వేడ్క వరించియుండుటన్
వేఁకటిగా [illegible], నయుదరంబుననున్న వాఁడు సు
శ్లోకుఁడు చక్రవర్తియగుఁజమ్ము నిజమ్ముగ, నమ్ము మమ్మరో!

పుత్రీ! నీధర్మచరిత్రంబునకు మెచ్చితి. నీవు కోరినవరంబిచ్చెద. వేఁడుము.

శ:- చిత్తము. జనకా! నాచిత్త మెల్లప్పుడు ధర్మమునందుఁ దగిలి యుండునట్లును నాకుదయింపఁబోవు పుత్త్రుండు దీర్ఘాయురారోగ్యైశ్వర్యబలసమన్వితుండగునట్లను గ్రహించి యాశీర్వదింపుఁడు.

క:- తథాస్తు (ఆశీర్వదించును. ఇరువురు నిష్క్రమింతురు)

(శకుంతలయుఁ [illegible] ఘటితుఁడును మరలఁ బ్రవేశింతురు)

క:- (శకుంతలను [illegible] సంతోషము [illegible]) తల్లీ! నీపూర్వపుణ్యవిశేషంబునఁ జక్రవర్తిలక్షణలక్షితుండగు ముద్దుకుమారుం గాంచితివి. [illegible] నిఖిలభువనరాజ్యాభిషేకంబునకుఁ దగినవాఁ డగుఁగాక. [illegible]

ఆ॥ ఎట్టిసాధ్వులకును బుట్టినయింట్లలో
బలుదినంబులుంట పనికిరాదు,
మగలకడనె వారి మనుగడ యుచితంబు,
పతియె స్త్రీకిఁ దలఁపఁ బ్రాణపదము,

కావున నీ విక్కుమారుం దోడ్కొని యాశిష్యులవెంబడి నీపతిపాలి కేఁగి యనవరతసౌఖ్యంబు లనుభవించుచు సుఖంబుగానుండుము. పోయిరమ్ము.

శ:— నాయనా! నమస్కరించెద. పోయివచ్చెదను. దయయుంచుఁడు.

(అందఱు నిష్క్రమింతురు)

(దుష్యంతమహారాజు సభదీర్చికూర్చుండియుండ శకుంతల భరతునితో మరలఁ బ్రవేశించును)

శ:— (రాజునవలోకించి) హృదయేశ్వరా! నమస్కరించెదను. నన్నుఁ గటాక్షింపుఁడు

దు:— (మిన్నకుండును)

శ:— జేరా! ఏమి యీదారుణకృత్యము. ఏమి యీయుగమాహాత్మ్యము. రాజచంద్రునకు గురునియాశ్రమంబున నాయందుఁ గల సంభ్రమాదరణానుగ్రహంబు లిప్పు డించుకయుఁ గానరావయ్యె. ఏమనవలయును

ఆ॥ కణ్వునాశ్రమమున గాంధర్వవిధి నన్నుఁ
బెండ్లియాడి కరము ప్రీతి వరము
కోరుకొమ్మటంచు గ్రుచ్చిగ్రుచ్చినదించి
ఇచ్చియుంట నెపుఁడ నెంచఁడొక్కొ,

మఱియు,

సీ॥ తలయెత్తియొకసారి తిలకింపఁ, డానాఁడు
మమతఁబల్కినపల్కు మఱచెనేమొ,

తనకుఁ దాన వచించుదాఁకఁ గానిమ్మని
హృదయంబులోన నూహించి చేసేమొ,
పలువార లిదిచూచి శంకింతురని తద్ద
భీతి నాదెస దృష్టి పెట్టఁడేమొ,
అధికారు లనుమాట యవలఁ ద్రిప్పరటంచు
మదినమ్మ్కటమె మోసమయ్యెనేమొ,
మఱచిమఱవక యిమ్మాడ్కి మసలునేమొ,
ఎఱిఁగియెఱుఁగక యీలీల నెసఁగునేమొ,
తలఁచితలఁపక యీపోకఁ దనరునేమొ,
ఎట్టులనఁదోఁప, దిఁక నేమి హేతు వకట !

అయ్యోదైవమా ! కలనైన నింతవంటి కఠినకృత్యము జరుగునని భావింపనైతిని. ఇఁకనట వచ్చి యిన్నకపోవుట పాడిగాదు. కావున నావృత్తాంతమెల్ల విన్నవించెద. ఇక్కుమారరత్నముం జూపించిన మన్నింపునేమొ. (అని ముందఱికివచ్చి)

మ॥ జననాథాగ్రణి ! పూర్వ మీవు మృగయాసక్తిన్ మదీయాశ్రమం
బునకేతెంచి రచించి యిచ్చిన వరంబుం జిత్తమం దెంచి యీ
ఘను బాలార్కసమానుసూను నను వేడ్కన్ యుష్మదంతఃపురం
బునఁ జేర్పించి యథార్థవాదివగుమీ భూమీజనుల్ మెచ్చఁగన్

మనోహరా ! పౌరవకులభూషణుండగు నీముద్దుకుమారుని గటాక్షించి నాహృదయసంతాపము నివారింపుము

దు:– (ఇంచుక కోపముతో)

ఉ॥ ఏ నొకనింతయేని నెఱుఁగ, నెక్కడిదానవొ యేగుదెంచి యో
మానిని ! యిట్లు పల్కెదవు, మా కపకీర్తి ఘటింపకుండ నీ
మానిప్రసంగముల్ వదలి క్రచ్చఱ వచ్చినత్రోవ నేగు, మి
మ్మానవకోటిలోన నవమానము నొందెదు లేక యుండినన్,

రమణీ ! నీయనుచితంబులయిన భాషణంబులు విని సహింపఁ జాలను. చీ చీ. ఏలలేనిపోని దొంక వింతగల్పించుకొని యిచ్చటికరుదెంచితివి ? ఎంతవీఁటిడివి!

శ:— (కన్నీరునించుచు నృపునివీక్షించి)

ఆ. భూమినాథ ! యిట్లు బుద్ధివిహీనులు
యయ క్రుల్లంగిబొంకు టనుచితంబు,
ఏనెఱుంగు దనుస్త్రీయుఁగిదుగా యుంచుఁ
దగునె తప్పఁబల్కఁ ధార్మికులకు,

ప్రాణేశ్వరా ! మన మొనరించిన కార్యమునకు సాక్షు లెవ్వరు లేరనికదా యిట్లు పరాభవించుచున్నావు? అట్లైన నాచిన్ని విన్నప మొకటియాలకింపుము

సీ॥ ధరమీఁది సర్వవృత్తము నెఱుంగుచునుండు
ధర్మము ల్నాల్గు వేదములు సాక్షి,
సమవృత్తి సర్వభూతములలోఁ గ్రీడింప
గమకించు పంచభూతములు సాక్షి
నిఖిలధర్మాధర్మనిర్ణయ మొనరించి
వర్ణించు పంచభూతములు సాక్షి,
ఎలమి దివారాత్రములు పేర్కఁ జరియించు
కమలబాంధవ నిశాకరులుసాక్షి
తలఁప సంధ్యలు నంతరాత్మయును జముఁడు
నభము నగ్నియు భూమియు విభువులగుచు
నన్వాహంబును సకలంబు నరయుచుండ
తిరస్కరింపంగ నేర్చునే ధరణి నరుఁడు,

నాథా! నేనెఱింగినయట్టు లివియన్నియు నీవాసంగినవర మెట్లుంగును గావున నాయందుఁ దొంటియట్టు లనుగ్రహించుటయే యుచితము. అవజ్ఞసేయఁ బాడిగాదు.

మత్తకోకిల॥ మానవాధిప! మున్ వరించినమానినిన్ విడనాడఁగా
మానసం బెటులోప్పెనీ, కిది మంచిదంచుఁ దలంచితే,
సూనృతోక్తియె మేలు, ధర్మపు సూరఁబుచ్చఁగఁజెల్ల, దీ
కానిచేఁతకు నీవొడంబడఁ గాదు, బుద్ధిఁ దలంపుమా,

కాంతా! ఇదియునుంగాక సంసారము గృహమేధిఫలం బనుభవించుచు ననుకూలవతియైన భార్య నవమానించుట పెద్ద యధర్మంబు. పుట్టిగట్టిన యాలిపై ... లేకపోవు టనుచితంబు. సదాచారవంతుఁడయిన పుత్రుఁ డుభయపక్షంబులవారి నుద్ధరించునని తలంచి నీపుణ్యాతిశయంబున నుద్భవిల్లిన యీ చిన్నికొడుకును జూచినైన దయ గలుగదే, అయ్యో! నాప్రాప్తి కేమందును (ఏడ్చును)

దు:— (ఆగ్రహమున)

పంచచామరము॥ శతేజపత్రనేత్ర! చాలుఁజాలు దుష్ప్రసంగముల్,
మఱిన్ మఱిన్ వినంగ నాదుమానసంబు మండెడిన్,
ధరాధరేంద్రకోటిలోన ధర్మవృత్తిఁబల్కు ని
చరిత్ర మింతయే నెఱుంగ, సత్యమిద్ది యంతయున్,

బోటీ! ఎంతవారలఁగయ్యాళితనమునకుఁ జొచ్చితివి. నే నెన్నడైన నీమొగముఁజూచియెఱుంగుదునా? సరే. వయోరూపబలపరాక్రమంబుల విచారించిచూడ వీఁడు నాయంతవాఁడుగాని సామాన్యుండు గాఁడు. అట్టివానిని సభికులముందఱ నందఱు నవ్వునట్లు నగ్గుమాలి

నీకొడుకని చూపింపఁదొడంగితివి. అసత్యమాడఁబూనినచో నిట్లుకదా యుండఁదగినది. ఇట్టి లోకవిరుద్ధంబున కేమందుము. అయుక్తంబు లయిన పలుకులు పలుకక శీఘ్రముగా నీయాశ్రమంబున కరుగుము.

శ:— వల్లభా! ఎంతపనిచేసితివి. ఎంతమోసపుచ్చితివి. నన్ను నీవు వివాహమాడలేదా? ఈచిన్నవాఁడు నీకుఁగలిగియుండఁడా?

దు:— వెలఁదీ! నీచరిత్రము నాకేమియుఁ దెలియదు. పలుమాఱు మీఱి విపరీతభాషణంబుల నాడక తొలఁగిపొమ్ము.

శ:— (సభికుల నాలోకించి)

సీ॥ నామనోహరుఁగూర్చి నన్నుఁబ్రోవరే గుణ
సాంద్రులార! ధరాధరేంద్రులార!
మేదినీపతిచెంత మెప్పింపరయ్య వి
ద్వాంసులార! పరమహంసలార!
నానాథుఁ జెపసేయనయ్యెఁ గాంచరె నగ
ధైర్యులార! నితాంతశౌర్యులార!
పాపపుణ్యములను బాటింపరయ్య యో
ధన్యులార! త్రిలోకమాన్యులార!
గీ॥ అనదనేఁ, బుత్రవతిఁగూడ, సదియుఁగాక
అగ్నిసాక్షిగఁ గైకొన్న యాలివిడువ
బుద్ధిగాదని వివరింపఁబూనరయ్య
భూధవుఁడుమెచ్చఁ గరుణించి పూజ్యులార!

(అందఱు శిరఃకంపమొనర్చి యూరకుందురు)

శ:— (విగతాశయై విషాదముతోఁ దనలో) హాసర్వేశ్వరా! ఈసభ వారిలో నొక్కరైనను న్యాయాన్యాయముల విమర్శించి

చెప్పవైరి. ఇంక నాకు నొండుశరణమెద్ది. తల్లీ భగవతీ !
సరస్వతీ ! నీవైన నన్నాదరించి నాపతినిగూర్చి రక్షింపుము.

(సరస్వతిని ధ్యానించును)

ఉ॥ నమ్మితి నామనోరథము న్యాయ్యము గాన ఫలించునంచు, మా
యమ్మ ! యనాథఁ బ్రోవఁదగునమ్మ, నిన్నుఁ భజియింతు వేల్పువె
ద్దమ్మ, ఘృణాసముద్రవుగదమ్మ, ననుం బతిఁగూర్చి కావ మే
లమ్మ సమస్తలోకముల కమ్మవు నీవెగదమ్మ భారతీ !

భరతుఁడు:— (తల్లిని వీక్షించి)

తే॥ అమ్మ ! మాయయ్య యిస్సుంపఁడయ్యె నేఁడు,
ఇంకమీఁదటిగతి విచారించిచూడ
ఎట్టులయ్యెడినో, మన కేదిదిక్కు,
పగదలంచెను దైవ మిప్పగిది నకట !

తల్లి ! నేఁడు మనపాల సర్వేశ్వరుఁడు లేఁడు. ఏమిసేయుదము.

(చింతించును)

శ:— కుమారా ! చింతిల్లకుము. మనకష్టములఁ గడతేర్చి కాపాడు
వాఁడు భగవంతుండుగాని యితరు లెవ్వరు దీని భరింపనోపరు.
తండ్రీ ! మన యాశ్రమంబునకైనఁ బోవుదమురమ్ము.

(ఇరువురు మరలిపోవుచుందురు)

(తెరలో॥ సత్యము సత్యము. దుష్యంతమహీపాలా !
మద్వచనంబు లాకర్ణింపుము)

చం॥ కువలయనాథ ! నీకును శకుంతలకుం దనయుండు వీఁడు, తే
మ్యువతి నిజంబుపల్కె, నది యుత్తమసాధ్వి, భరింపు మీయమున్,

రవిసమతేజ ! వీని యువరాజ్యధురంధరుఁజేయు, మెల్ల మా
నవులు నుతింప నాపలుకు నమ్మి వివేకముతోడ నియ్యెడన్,

(మింటినుండి పుష్పవర్షము వర్షించును)

దు:— (లేచి)

చం॥ పరమపతివ్రతారమణిపల్కినమాటయె సత్య, మింతి నే
నరయక పెండ్లియాడుటది యన్య లెఱుంగమి నే నెఱింగి ప
ల్వూరు హసియించిపోదురని లోకవిరుద్ధము కోడియుండ స
త్వరము వచించె దా గగనవాణి, సభాసదులార ! వింటిరే,

విద్వచ్ఛిరోమణులారా ! నాకొనర్చిన కూరకృత్యము నభి
వర్ణించి నన్ను నిందింపకుడు. లోకాపవాద యపనయించుకొనుటకు
నిట్లు లాచరించితిని, మన్నింపుడు

సభికులు:— రాజాగ్రణీ ! సత్యము సత్యము. ఇప్పుడందఱకి సంత
సముగలిగినది

దు:— (భరతునిజూచి సంభ్రమమున)

ఆ॥ నాదుకందు ! రార, నాచిన్నిసుత ! రార ,
అప్ప ! రార, విరులకుప్ప ! రార,
కొడుక ! రార, పుడుకుదొడుక ! యనుంగు
కూన ! రార, ముద్దుకుఱ్ఱ ! రార,

(ఆలింగనమొనర్చి యంకముపై నిడుకొనును)

శ:— కం॥ నానాథ ! నన్నుఁ గూరిమి
సూనుని జేపట్టి ప్రోవఁజూచి యిపుడు నా
మానస మలరించితి, స
న్మానము మఱియింతెచాలు మానవనాథా !

(నమస్కరించును)

దు:– తే॥ వనజదళనేత్ర ! నీమహాత్త్వంబు పుడమి
జనులు పేర్కొన నిటులేను సల్పినాఁడ,
కాని మఱిమొంతుగాదుచూ, దాని నీదు
భావమున నుంపఁబో కహాహా భాసురాంగి !

హృదయేశ్వరీ ! నీకోర్కె సఫలమయ్యెఁగదా !

ప్రాణేశ్వరా ! ఇందుకు సంతసించెదను

కాంతా ! ఇంకను నీయిష్టమేమి ? ఈచిన్నికుమారునకు యువ
రాజ్యపట్టాభిషేకము చేయవలెననిగదా !

నాథా ! నాయిష్టమేమున్నది. మీయిష్టమే నాయిష్టము

- సభికులారా ! ఈచిన్నికొమరునకు యౌవరాజ్యపట్టాభిషేకము
గావింతము

– రాజచంద్రా ! సంతోషము సంతోషము. అటులనే చేయు
దము

(భరతుని సింహాసనముపైఁగూర్చుండఁబెట్టి యువరాజ్యపట్టాభి
షేకమహోత్సవము గావింతురు. మింటినుండి దేవతలు పుష్పవృష్టిని
గురియింతురు. అందఱు నిష్క్రమింతురు)

— భరతవాక్యము —

మత్తవిభాతి॥ అనయమును భూమిపతు లెనయుదురు ధర్మమతి,
వినయమున భూజనులు మనుదు రొగి వేడ్కన్,
ఘనతతి గురియుఁ ధరణి ననువుగను వర్షములు,
మునుమునుగ సస్యములు ననయము ఫలించున్,

వనిత లతిభక్తిగను మనములర వల్లభుల
నెనసి సుఖయింపుదు ఱేకను ముదముతోడన్,
మనుజు లిల శాంతిమతి ననుదినము వృద్ధిగన
వనజదళలోచనుఁడు మనుచును జగంబుల్.

గద్య॥ ఇయ్యది రామచంద్రకరుణాకటాక్షవీక్షణసమాసాదితాంధ్ర కవితావిలాస శ్వాలాయనసూత్ర గార్గ్యసగోత్రపవిత్ర ఘంటాభట్లాన్వయపయఃపారావారసుధాధామ నాగనామార్యపుత్రతనూభవ వినుతవిద్వజ్జననికాయ వేంకటభుజంగనామధేయ ప్రణీతంబైన యభినవశాకుంతలమను శృంగారనాటకంబునం జతుర్థాంకము.



సంపూర్ణము.



అనుబంధములు.

(నటీ నటులు) తోడి - తాళం - రూపకం.

౧ కాంతాలలామ - సంతసమున నా - చెంతరాగదవే ॥ ప ॥ కుంతీ - మదనుని విరి బంతీ - సంశయమిసు - మంతైె - ననుఁజెందక - చెంత ॥౧॥ తామరసాక్షి - నన్నుఁ బిలిచితిరిట కేమికారణము ॥ ప ॥ మీామా - ననమునఁ గల ప్రేమా - లలనా జన - కామా - వివరిం పుడి - యేమి ॥ ౨ ॥

(బృహస్పతి) ఏకతాళం - తోడి - గేయము.

౨ నమోనమోనగరమానుష హార - సుమానసాంబురుహేక్షణా - అమర్త్యనుత శమాదమాదిగుణాయుత - ప్రమోదచర్యవిచక్షణా ॥౧॥ కరీంద్రపోషణ సురేంద్రతోషణ - స్ఫురద్ధిరణ్మయభూషణా శరీశసాయక వరప్రదాయక - శరేజముఖ మృదుభాషణా ॥ ౨ ॥ ప్రపీతకాశ్యేయపాపసంహార - విపక్షతతిసంభేదనా - అపారశౌర్యసుకృ కలిత - ప్రపన్నచయవిచ్ఛేదనా ॥ 3 ॥ నిదానసమ్యగ్విధానసత్య - బుధాళిసన్మానిజీవనా - వదాన్యత్రిభువనముదావహావిక్రమ - శ్రీధా ముఖ భక్తజనావనా ॥ ౪ ॥

(మేనక) ఏకతాళం - కాఫీ.

3 మహేంద్రనతసుర - మహీరుహహారోపమ - మహావిభవశీలా కిరిదె - జోహారు సురపాలా ॥ ౧ ॥ నితాంతసద్గుణ - నిశాంతశాస్త్రవ - కృతాంతగిరిధరా - దివ్యత్రపతాపమణి హారా ॥ ౨ ॥ విభావరీశ్వర - నిభాననాచిత్రభానుసమతేజా - సంతత శుభోదయబిడౌజా ॥ 3 ॥

(మేనక) తాళం.

౪ ఇందుముఖకుందారవింద ప్రసూనముల ॥ ఇం॥ యందుసొంపు మీరుచుమి - ళిందసుగానముల - చందమందమాబాల - మందార గుచ్ఛముల - సుందరమును మఱందుగనగ - చెందమలరెరోదలు చినగ -

మేల్ మేల్ మేల్ మేల్ సందియంబు లేకచూడు ॥ ౪౦ ॥

(విశ్వామిత్రుఁడు మేనకను చూచి) రూపక తాళం - తోడి.

౫ సుందరాంగి యెవరో కాని - చూడ వేడుకయ్యె నహా ॥ సుం ॥
చందమామ గేరు మోము - చందమున్న గాని ॥ సుం ॥ ౧ ॥ మధుకర
ముల నేలు కురులు - మృదుల మానితంబముల్ - మధుర మైన వాగ్వై
భవము - మదికి నింపు పుట్టెనింక ॥ ౨ ॥ మోహనాంగి బాలుకి దంప
ద్రోహ బుద్ధి యని తలంప - మోహ మెంతి చెడ్డ పనికి - సాహసి యా - నా గ
నకల ॥ సుం ॥ ౩ ॥ ధరణి ముసల పురరి మేను - కరుణ యీ విధంబు
తెలియ తరుణి - గవయు మానసంబు - దవిలె నేమి సేయువాఁడ ॥ సుం ॥ ౪ ॥

విశ్వామిత్రుఁడు - మేనక - కాఫీ ఏకతాళం

౬ మానినితిలకా - మమతయుఁజిలుకా - ముక్కున నేలగిదే ॥ మా
మానశరాసను - గ్గానికి నోర్వను ॥ ప ॥ ౧ ॥ మే ॥ వలదు మునీంద్రా -
వరగుణసాంద్రా - వంచన సేయఁదగున ॥ వ ॥ వల నాయునిచా - కల -
వెల వేఁబో ॥ ౨ ॥

౧ మానవతీలలామ, - యభిమానము గాపాడుము - మానప
మునఁగల సందియంబు విడనాడుమా - మన మన మన మన - మనవిని
మునుకొను ॥ మానినితిలకా ॥

౨ మిాబోటి మహాసీయులకు నేఁదగిన దాననే - మాబోటి చెలులు
సంగతియు మంచిది గాదుసుమా - హరిహరి హరిహరి మతి యిటులనకుఁమా ॥
వలదు మునీంద్రా ॥

(శకుంతలఁజూచి) తాళము.

౭ ఎంతో చిత్రమయ్యె నాకిపు - డీలతాంగిఁజూడఁగన్ - నంతిన
మునమిగుల నేఁడు - సంతసంబు గల్గెడిన్ భళి ॥ ఎం ॥ ప ॥ బాలసుగుణ
జాలవరిసు - శీల యెవరి - బాలిక యొకో ॥ ఎం ॥ ౧ ॥ చిన్ని ముద్దు
పట్టు పైనను - నెన్న రాని కూర్మియున్ - మున్ను మున్ను గనుజనించు -
చున్న వేమి హేతువో యిఁక ॥ ఎం ॥ ప ॥ పడఁతి యెవరో బడలియుడలి -
బుడుతెపిడిచిపో యెనహహా ॥ ఎం ॥ ౨ ॥

III

(దుష్యంతుఁడు పౌరులతో) రూపక తాళం కన్నడ.

౮ పురవరులారా - మోదముమీరా - సరగునబొండుమీ - యిరవులకిప్పుడు ॥ పు ॥ ౧ ॥ దుష్టసత్వముల - దునుమాడియునే - శిష్టమునులనడంచియు - గాపాడెదసుమీ - పు ॥ ౨ ॥ మంతనమునసను - మంతవెలివకుండే - వంతలుదీర్తుము - శాంతకుకరుణాచే ॥ పు ॥ ౩ ॥

(వేట) మృగయులు) తాళం.

౯ ఇదిగోయిదియిదియిదె కనుగొనరా - పెద పెద మెకముల రా ॥ వినరా - వినరా - వినరా - వినరా - పల్లవి ॥ తెల్లు నెల్లువిరుకోళ్లు కొండిగ్రామలు కుందేళ్ళురా - గిజిగాళ్ళురా ॥ ౧ ॥

(దుష్యంతుఁడు) తాళం.

౧౦ ... - కనుగొనరా - మదమణగించెద - పెద్ద పులిరా - ... బెదరిబెదరి - పదరుచున్నదిరా ॥ ప ॥ గిరుల ... హారుల ... దిగిలిరిగి ... నరసి బలు ... - గడగడవడంకుచుఁదడబడంబడిజవ - ముడిగియడవిఁ ... - డడవిమృగంబులు - నడుగిడంజాలక ॥ ప ॥ ౧ ॥

(దుష్యంతునిఁజూచి శకుంతల) తాళం.

౧౧ అహాహా! యీమోహనాంగుఁడెవఁడో - హరిహయుఁడో లోకహారుఁడో మారహారుఁడో - సుమశరుఁడో ॥ ప ॥ కడగడగక - మానమునకుఁ - ఘనమోదముఁ - జనియించెఁ ॥ అ ॥ ౧ ॥ ఏందు గాన మీసుందరునకుసమము - అందమైనయీసుగుణము - సోయ గము - సువినయము ॥ ప ॥ ఇందునరుగుదెంచినట్టి - చందమేమొ తెలియదయ్యో ॥ ౨ ॥

(దుష్యంతుఁడు శకుంతలనుజూచి) చాపు - తాళం.

౧౨ మోహనా - కారియీశ్యాం - గారమొన్నంగానావశమె చా ॥ సిరజారిమించినముద్దుమోము .. శుభకళలామీనాక్షు - రతిస

15240